# టెండర్ల ప్రక్రియ, కాంట్రాక్టుల నిర్వహణ

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టు పనుల్లో సాధారణంగా అనుసరిస్తున్న టెండర్ల ప్రక్రియకు భిన్నంగా జలయజ్ఞం కొత్త పద్ధతికి తెర తీసింది. ఈ కార్యక్రమం కింద ప్రాజెక్టులకు సంబంధించిన పనులన్నింటినీ ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసి) పద్ధతిలో టర్న్‌కీ ప్రాతిపదికన అప్పగించారు. సర్వే, ఇన్వెస్టిగేషన్, డిజైను, ప్రాజెక్టు పనుల అమలును ఒకే నిర్ణీత ధరకు అప్పగించే నేపథ్యంలో టెండర్ల ప్రక్రియ, కాంట్రాక్టుల నిర్వహణ మరింత ప్రాముఖ్యతను సంతరించు కుంటాయి. టెండరింగు, కాంట్రాక్టు నిర్వహణ ప్రక్రియలపై ఆడిట్ సమీక్షలో ఈ కింది విషయాలు వెల్లడయ్యాయి.

## 4.1 ఈపీసి కాంట్రాక్టు విధానం

ప్రాజెక్టుల పనులు నిర్ణీత కాలంలో పూర్తి చేసేందుకూ, యాజమాన్యానికి కష్ట నష్టాలు తగ్గించుకునేందుకూ 'కన్సల్టింగ్ ఇంజనీర్ల అంతర్జాతీయ సమాఖ్య (ఫిడిక్)' రూపొందించిన ఈపీసి కాంట్రాక్టు విధానాన్ని ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్నారు. ఈ విధానంలో గుత్తేదారు ప్రాజెక్టును లేదా పనులను డిజైను చేసి, అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసి, నిర్మాణాన్ని స్వయంగా గానీ, లేదా పనుల్లో కొంత భాగాన్ని ఉప-గుత్తేదార్లకు అప్పగించడం ద్వారా గానీ పూర్తి చేసి స్వంతదారుకు అప్పగిస్తాడు. ఈ కాంట్రాక్టు పద్ధతిలో గుత్తేదారు ఒక స్థిరమైన విలువకు కట్టుబడి నిర్ణీత సమయానికి పనులను పూర్తి చేయడంలోని వ్యయప్రయాసలన్నింటినీ తానే భరిస్తాడు. కనుక ఈ కాంట్రాక్టు పద్ధతిని "లంప్‌సమ్ టర్న్‌కీ" అని కూడా అంటారు. యజమాని (i) ప్రాజెక్టు పరిధి, స్పెసిఫికేషన్లను, (ii) నాణ్యతా ప్రమాణాలను, (iii) గడువు తేదీలను, (iv) మూల్యాన్ని స్పష్టంగా నిర్వచించాలి.

### 4.1.1 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరించిన ఈపీసి విధానం

జలయజ్ఞం కార్యక్రమం కింద చేపట్టిన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరించిన ఈపీసి నమూనా ఈ కింది విధంగా ఉంది :

| గుత్తేదారు బాధ్యతలు | ప్రభుత్వ బాధ్యతలు |
|---|---|
| **ఇంజనీరింగ్:**<br>• హెడ్‌వర్క్స్, కాలువలు, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థల నిర్మాణం కోసం ప్రాజెక్టు స్థలానికి సంబంధించిన సర్వేలను నిర్వహించడం<br>• సాగులోకి తీసుకుని రావల్సిన ప్రాంతాన్ని గుర్తించడం<br>• వివిధ నిర్మాణాల రూపకల్పన కోసం భూమిలోపలి భాగాలను అన్వేషించడం, కాలువలకు, మిగతా అన్ని నిర్మాణాలకు హైడ్రాలిక్ వివరాలను తయారు చేయడం<br>• భూసేకరణకు సంబంధించి భూమి షెడ్యూల్సును తయారుచేయడం, నిర్మాణం కోసం స్థలాన్ని అందుబాటులోకి తేవడం వంటి తదుపరి ప్రక్రియల కోసం డిపార్టుమెంటుకు సమర్పించడం | • గుత్తేదారు సమర్పించిన డిజైన్లను, డ్రాయింగులను ఆమోదించడం<br>• కాంట్రాక్టరుకు భూమిని అందజేసే ఏర్పాటు |
| **కొనుగోలు:**<br>• సిబ్బంది అవసరాన్ని, యంత్రాలు, సామగ్రి వంటి వాటి అవసరాన్ని లెక్కగట్టడం, కొనుగోలు చేయడం | • కోరిన సందర్భాల్లో అర్హతను బట్టి మొబిలైజేషన్ అడ్వాన్సును అందించడం |

| గుత్తేదారు బాధ్యతలు | ప్రభుత్వ బాధ్యతలు |
| --- | --- |
| నిర్మాణం:<br>♦ అంగీకరించిన మైలురాళ్ల ప్రకారం, ప్రాజెక్టులో వివిధ అంశాలకు ఆమోదితమైన హైడ్రాలిక్ వివరాలు, డిజైన్లు, డ్రాయింగుల ప్రకారం నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేయడం.<br>♦ డిపార్టుమెంటుకు, మూడోపార్టీ నాణ్యత నియంత్రణ సంస్థలకు సంతృప్తి కలిగించే విధంగా నాణ్యత నియంత్రణ ప్రయోగశాలను ఏర్పాటు చేయడం, వివిధ పరీక్షలను చేయడం, సామగ్రి, పరీక్షా ఫలితాలు, మార్క్ అవుట్ రిజిస్టర్లు, ప్లేస్‌మెంట్ రిజిస్టర్లు, కన్సాలిడేషన్ రిజిస్టర్లు, అవసరమైన ఇతర రికార్డులను నిర్వహించడం.<br>♦ చేసిన పనికి సంబంధించిన కొలతలను రికార్డు చేయడం, వాటిని తనిఖీ, చెల్లింపుల కోసం డిపార్టుమెంటుకు సమర్పించడం.<br>♦ ప్రాజెక్టు పూర్తైన తరువాత రెండేళ్ల పాటు ప్రాజెక్టును నిర్వహించడం. | ♦ నిర్దేశిత గడువులోగా ప్రాజెక్టు పూర్తి అయ్యేలా పని నాణ్యతను, పురోగతిని పరిశీలించడం. |

i. ఈపీసి కాంట్రాక్టింగ్ విధానం సాధారణ నియమాలకు సంబంధించిన ముందుమాటలో ఈపీసి టర్న్‌కీ ప్రాజెక్టులు ఈ కింది పేర్కొన్న ప్రత్యేక సందర్భాల్లో అనువైనవి కావని ఫిడిక్ అభిప్రాయపడింది :

- ***యజమాని అవసరాలను పరిశీలించి పరీక్షించుకునేందుకుగానీ, డిజైన్లను తయారు చేసుకునేందుకుగానీ, రిస్కును మదింపు వేసి, అంచనాలను తయారు చేసుకునేందుకు తగినంత సమయం, సమాచారం టెండరర్లకు లేకపోతే ఈపీసి టర్న్‌కీ విధానం అనువైంది కాదు :*** ప్రాజెక్టు పరిమాణాన్ని, క్లిష్టతను బట్టి బిడ్డింగ్ సమయం ఆధారపడి ఉంటుంది. ఈపీసి విధానంలో బిడ్‌లను వేసే ముందు గుత్తేదారు సంస్థలు ప్రాథమిక సర్వే, ఇన్వెస్టిగేషన్‌లను చేయాల్సి ఉంటుంది కనుక బిడ్డింగ్‌కు తగినంత సమయం ఇవ్వాల్సిన అవసరం ఉంది. జలయజ్ఞంలో బిడ్ వేసేందుకు ఇచ్చిన సమయం 8 రోజుల (తెలుగు గంగ) నుంచి 300 రోజుల (గాలేరు నగరి) వరకు ఉందని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. మచ్చుకు తనిఖీ చేసిన 180 ప్యాకేజీల్లోని 37 ప్యాకేజీల్లో బిడ్ వేసేందుకు ఇచ్చిన సమయం 30 రోజులకన్నా తక్కువగా ఉంది. బిడ్ వేసేందుకు ఇచ్చిన సమయం 30 రోజుల కన్నా తక్కువగా ఉన్నప్పుడు సగటున 2 బిడ్ల కన్నా తక్కువగా వచ్చాయి. బిడ్ వేసేందుకు సమయం 30 నుంచి 60 రోజుల వరకు ఇచ్చినప్పుడు వచ్చిన సగటు బిడ్ల సంఖ్య 5. కాబట్టి ప్రాజెక్టుల పరిమాణాన్ని, క్లిష్టతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, బిడ్ వేసేందుకు ఇచ్చే సమయాన్ని ప్రమాణీకరించినప్పుడే ఈపీసి విధానం అనువైనదిగా మారుతుంది.
- ***నిర్మాణంలో ప్రధాన భాగం నేల కింద జరుగాల్సి ఉన్నా లేదా టెండరర్లు పరీక్షించుకోలేని ప్రదేశాల్లో ఉన్నా :*** ఎస్ఎల్‌బిసి సొరంగం (51 కిలోమీటర్ల సొరంగం), వెలిగొండ (18 కిలోమీటర్ల సొరంగం), ఇంకా పోలవరం మాదిరిగా స్పిల్‌వే డ్యామ్, హెడ్‌వర్క్స్ లాంటి జలయజ్ఞం పనుల్లో నేల కింద చేయాల్సిన పని గణనీయంగా ఉంది.

ii. ఫిడిక్ కాంట్రాక్టు నిబంధనల ప్రకారం, ఒప్పందంలో పేర్కొన్న సమయంలోగా లేదా పని ప్రారంభమయ్యే తేది నుంచి గానీ గుత్తేదారు వచ్చి పనిచేసేందుకు అనువుగా యజమాని స్థలాన్ని అందుబాటులో ఉంచాలి. ఐతే, పలు కేసుల్లో ప్రాజెక్టుల అమలు కోసం వివాదాలకు తావులేని భూమిని ప్రభుత్వం ముందుగానే గుత్తేదార్లకు ఇవ్వలేక పోయింది.

iii. ***పని పరిధి, నిర్దేశాల్లో మార్పులకు వీలుగా ఒప్పందం నిబంధనలు ఫిడిక్ నమూనాలో ఉన్నాయి :*** జలయజ్ఞం ప్రాజెక్టుల్లో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల్లో మార్పులకు సంబంధించిన నిబంధనలు లేవు.

iv. ***ఒప్పందాల్లో మార్పుల విలువను లెక్కగట్టేందుకు వీలుగా టెండర్లతో పాటు పరిమాణాలతో సహా పూర్తి స్థాయి ధరల వివరాలను, యూనిట్ ధరలను, ధరలకు సంబంధించిన ఇతర సమాచారాన్ని ఇవ్వాలని ఫిడిక్ నమూనా సూచిస్తోంది :*** మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టుల్లో యూనిట్ ధరల పూర్తి వివరాలు, పనిలో ఇమిడి ఉన్న పని పరిమాణాలు లేవు. తరువాత ప్రభుత్వం జి.ఓ. 50 (2009 మార్చి) ద్వారా పరిమాణాలకు అనుగుణంగా కోట్ చేసే విధానాన్ని అధికారికంగా రద్దు చేసింది.

## 4.2 గుత్తేదారు సంస్థల 'ఎంప్యానెల్‌మెంట్'

అనుకున్న సమయంలోగా ప్రాజెక్టులను పూర్తి చేసేందుకూ, ప్రతీ పనికి ఒప్పందాలను ఖరారు చేయడంలో టెండరు విధానంలో ఉన్న సుదీర్ఘ జాప్యాలను నివారించేందుకూ, ముందస్తుగా నిర్దేశిత అర్హత ప్రమాణాలను కలిగి ఉన్న గుత్తేదారు సంస్థల జాబితాను తయారు (ఎంప్యానెల్‌మెంట్) చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### 4.2.1 ముందస్తు అర్హతా ప్రమాణాలు

ప్రాథమ్యమైనవిగా గుర్తించిన ప్రాజెక్టుల టెండర్లలో పాలుపంచుకొనేందుకు గుత్తేదారు సంస్థలను ఎంపిక చేసే ఎంప్యానెల్‌మెంట్ ప్రక్రియలో ఈ కింది ప్రమాణాలను నిర్దేశించారు.

| | క్యాటగిరీ-I | క్యాటగిరీ-II |
|---|---|---|
| | ప్రాథమ్య ప్రాజెక్టులలోని భారీ ప్యాకేజీలకు (ఒప్పందం విలువ ₹100 కోట్లకు పైగా ఉన్నవి) | ప్రాథమ్య ప్రాజెక్టులలోని మధ్యతరహా ప్యాకేజీలకు (ఒప్పందం విలువ ₹50 - 100 కోట్ల మధ్య ఉన్నవి) |
| (i) | (i) మట్టి పని, కాలువ లైనింగ్, (ii) వంతెనలు, ఇతర కట్టడాల నిర్మాణంలో లేదా ప్రత్యేక తరగతికి చెందిన సివిల్ పనుల్లో నైపుణ్యత కలిగి ఉండి, సదరు సంస్థ/కంపెనీ ప్రత్యేక తరగతి కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వద్ద రిజిష్టరు అయిఉండాలి. | భారీ సాగునీటి ప్యాకేజీలకు ఉన్న ప్రమాణాల మాదిరిగానే |
| (ii) | ఐదు ఆర్థిక సంవత్సరాల బ్లాకు పీరియడ్‌లో కనీసం రెండు సంవత్సరాల్లో వార్షిక టర్నోవర్ ₹400 కోట్లకు తగ్గకూడదు | ఐదు ఆర్థిక సంవత్సరాల బ్లాకు పీరియడ్‌లో కనీసం రెండు సంవత్సరాల్లోవార్షిక టర్నోవరు ₹50 కోట్లకు తగ్గకూడదు |
| (iii) | గత ఐదు ఆర్థిక సంవత్సరాల బ్లాకు పీరియడ్‌లో ₹100 కోట్లకు తగ్గకుండా కనీసం **ఒక** సామ్యమైన పనిలో*, ప్రధాన గుత్తేదారుగా ఒప్పందం విలువలో 90 శాతానికి తక్కువ కాకుండా సంతృప్తికరంగా పూర్తి చేసిఉండాలి | గత ఐదు ఆర్థిక సంవత్సరాల బ్లాకు పీరియడ్‌లో ₹20 కోట్లకు తగ్గకుండా సామ్యమైన కనీసం **ఒక** పనిలో*, ప్రధాన గుత్తేదారుగా ఒప్పందం విలువలో 90 శాతానికి తక్కువ కాకుండా సంతృప్తికరంగా పూర్తిచేసి ఉండాలి |
| (iv) | నికర విలువ ₹100 కోట్లు | నికర విలువ ₹5 కోట్లు |
| (v) | గత మూడేళ్లలో పన్ను లెక్కింపుకు ముందు నికరలాభం | గత మూడేళ్లలో పన్ను లెక్కింపుకు ముందు నికరలాభం |
| (vi) | ఉమ్మడి సంస్థ అయితే, భాగస్వాముల సంఖ్య మూడుకు మించకూడదు | ఉమ్మడి సంస్థ అయితే, భాగస్వాముల సంఖ్య రెండుకు మించ కూడదు |

**సామ్యమైన పనులు అంటే సి.ఎం. & సి.డి. పనులు, హైడ్రాలిక్ టన్నెల్స్ పనులతో కూడిన డ్యామ్‌లు / బ్యారేజీలు / కాలువ వ్యవస్థలు / ఎత్తిపోతల పథకాలు / జల విద్యుత్తు ప్రాజెక్టులు.*

కేటగిరీ - I కింద 19 సంస్థలను, కేటగిరీ - II కింద 65 సంస్థలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ విషయమై ఆడిట్ పరిశీలనలు ఇలా ఉన్నాయి.

*i.* ***పూర్వానుభవం ప్రమాణాలు :*** జలయజ్ఞం కింద కుదుర్చుకునే ఈపీసి ఒప్పందాలలో జలాశయాలు, డ్యామ్‌లు, పంపు హౌసుల నిర్మాణం, ఎత్తిపోతల కోసం పంపులు-మోటార్ల ఏర్పాటు, కాలువల తవ్వకం, పైపులైన్లు వేయడం

వంటి వైవిధ్యమైన పనులను చేయడమే కాకుండా సర్వే, ఇన్వెస్టిగేషన్, ప్రాజెక్టును డిజైను చేయడం వంటి అంశాలను కూడా గుత్తేదారు సంస్థలు చేయాల్సి ఉంటుంది. సర్వే, ఇన్వెస్టిగేషన్, డిజైను అంశాలతో కలిపి పైన పేర్కొన్న అన్ని పనులు లేదా వాటిలో చాలా పనులను గుత్తేదారు సంస్థలకు అప్పగించారు అంటే ఆయా ప్యాకేజీ ల కింద చేయాల్సిన అన్ని పనుల్లో గుత్తేదారు సంస్థలు కనీస అనుభవాన్ని కలిగి ఉండాలి. ఐతే, ఇలాంటి ఏదో '**ఒక**' పనిని సంతృప్తికరంగా పూర్తి చేసి ఉండాలని ప్రభుత్వం నిర్దేశించింది. ప్రభుత్వం ఇచ్చిన మునుపటి ఆదేశాలకు[1] ఇది గణనీయమైన మార్పు. పైగా, ఉమ్మడి సంస్థల్లోని అన్ని సంస్థలకూ లేదా ఏ ఒక్క సంస్థకు అయినా ఈపీసీ టర్న్‌కీ కాంట్రాక్టుల నిర్వహణలో గత అనుభవం ఉండాలన్న నిబంధన ఏదీ అర్హతా ప్రమాణాల్లో నిర్దేశించలేదు.

కనీస పరిమాణాలను చేసి ఉండడం కన్నా, పనులను పూర్తి చేయాలన్న అంశానికే అత్యధిక ప్రాధాన్యమిచ్చినట్టు నీటిపారుదల శాఖ సమాధానంలో పేర్కొంది (2012 జూలై). ఐతే, సంబంధిత రంగంలో సాంకేతికపరమైన సామర్థ్యం లేకుండా పనులను పూర్తి చేయడం నాణ్యమైన ఉత్పత్తినిస్తుందని భరోసా లేదు కనుక ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు.

*ii.* ***పరికరాలు & సిబ్బంది:*** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రామాణీకరించిన ఒప్పంద విధానం ప్రకారం, బిడ్డర్లు (i) ముఖ్యమైన, మౌలికమైన యంత్ర పరికరాలు (ii) కీలక స్థానాల్లో తగినంత అనుభవమున్న సిబ్బంది లభ్యతను నిర్ధారించుకోవాలి. ఐతే, 'ఎంప్యానెల్‌మెంట్'కు అర్హత ప్రమాణాలను నిర్దేశించడంలో పై అంశాలను ప్రభుత్వం లక్ష్యపెట్టలేదు.

ఈ అంశాల వివరాలను బిడ్డర్లు తెలియజేయాలనీ, గతంలో చేసిన పనుల అనుభవంతో బిడ్డర్లు ఇందుకు సంబంధించిన ప్రమాణాలను కలిగి ఉంటారని **ఆశించామనీ** నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది (2012 జూలై). భారీ ప్రాజెక్టుల పనులను అప్పగిస్తున్నప్పుడే, ఈ అంశాలను నిర్దేశించాలి, పరిగణించాలి అంతేగానీ కాంట్రాక్టు సంస్థలు వాటికవే సంబంధిత ప్రమాణాలను పాటిస్తాయని **ఆశించడం** సరికాదు కనుక ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు.

*iii.* ***బిడ్ సామర్థ్యం :*** జలయజ్ఞం కోసం సంస్థలను ఎంప్యానెల్ చేయడానికి ముందు, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తూ ఉన్న ప్రమాణీకృత విధానంలో గుత్తేదారు సంస్థల బిడ్ సామర్థ్యాన్ని '2 AN−B'[2] అనే సూత్రం ద్వారా నిర్ధారించడం జరిగేది.

ఐతే, ఎంప్యానెల్‌మెంట్ చేసేప్పుడు అప్పటికి అమలులో ఉన్న ఈ విధానాన్ని ప్రభుత్వం పరిగణించనూలేదు, 'జలయజ్ఞం'లో టెండర్ల మూల్యాంకనంలో గుత్తేదార్ల బిడ్ సామర్థ్యాన్ని మదింపు వేసేందుకు మరో విధానాన్ని నిర్దేశించనూలేదు.

నిర్ణీత సమయంలోగా పనులను పూర్తి చేయడంలో అనుభవం, ఆర్థిక సామర్థ్యమున్న సంస్థలనే ఎంప్యానెల్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందనీ, కనుక ప్రతిసారీ ప్రతీ బిడ్‌నూ సాంకేతికంగా మూల్యాంకనం చేయాల్సిన అవసరం ఉందని భావించలేదనీ నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది (2012 జూలై). ఏమైనప్పటికి, వివిధ కారణాల వలన చేపట్టిన పనుల్లో ఏ ఒక్కటీ అనుకున్న సమయానికి పూర్తి కాలేదు కనుక ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు.

---

[1] జి.ఓ. ఎమ్ఎస్ సంఖ్య 23, తేదీ 5 మార్చి 1999 ; జి.ఓ. ఎమ్ఎస్ సంఖ్య 94, తేదీ 1 జులై 2003, అనుసరించి గుత్తేదారులు సిమెంటు కాంక్రీటు, మట్టిపనులు, సంబంధిత ప్రధానాంశాలలో 50 శాతం పరిమాణంలో చేపట్టి ఉండాలి

[2] 'A ' గడచిన ఐదేళ్లలో ఏదో ఒక సంవత్సరంలో గుత్తేదారు చేసిన సివిల్ పనుల అత్యధిక విలువను సూచిస్తుంది. ప్రస్తుతం అమలౌతున్న , చేతిలో ఉన్న పనుల విలువను 'B' సూచిస్తుంది. 'N' అంటే పనులను పూర్తి చేయడానికి నిర్దేశించిన గడువు (సంవత్సరాల సంఖ్య). ఈ విధానం ప్రకారం ఏ పనుల కోసం టెండర్లను పిలిచారో ఆ పనుల అంచనా విలువ కంటే తమ బిడ్ సామర్థ్యం ఎక్కువని బిడ్డర్లు నిరూపించుకోవాలి

ప్రతిసారీ బిడ్లను సాంకేతికపరంగా మూల్యాంకనం చేయకపోవడం వల్ల టెండరు ప్రక్రియలు తక్కువ సమయంలో పూర్తయ్యాయని అనడంలో కూడా వాస్తవం లేదు. ఎందుకంటే, టెండర్లను ఖరారు చేయడానికి 303 రోజుల (దేవాదుల) దాకా సమయాన్ని తీసుకోవడం జరిగింది.

ఎంప్యానెల్ చేసిన సంస్థలకు అప్పగించే ప్యాకేజీల సంఖ్యను అత్యధికంగా మూడుకు మాత్రమే పరిమితం చేస్తూ ఆదేశాలనిచ్చామని, తరువాతి ప్యాకేజీ లను జిఓ. ఎంఎస్. సంఖ్య 94 ను అనుసరించి సంస్థల ఆర్థిక సామర్థ్యాన్ని నిర్ధారించేందుకు వీలుగా ఓపెన్ క్యాటగిరీ కింద అప్పగించామని కూడా నీటిపారుదల శాఖ తెలిపింది.

ఐతే, నీటిపారుదల శాఖ సమాధానం సరికాదు. కేటగిరీ - I కింద ఎంప్యానెల్ అయిన 8 సంస్థలకు, కేటగిరీ - II కింద ఎంప్యానెల్ అయిన 15 సంస్థలకు మూడు కన్నా ఎక్కువ ప్యాకేజీలను ఇచ్చినట్లు ***అనుబంధం 4.1*** ని బట్టి తెలుస్తోంది.

*iv.* ***విదేశీ సంస్థలు :*** అనుభవానికి సంబంధించి విదేశీ సంస్థలు సమర్పించిన అనుభవపత్రాలు ఆయాదేశాల్లో, ఇతర ప్రాంతాల్లో చేసిన పనులకు సంబంధించినవే తప్ప భారతదేశంలో చేసినవి కావు. కనుక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఈ సంస్థల అనుభవ పత్రాలను సరిచూసుకునే వీలులేదు. అంతేకాక, పోలవరం ప్రాజెక్టులోని స్పిల్ - వే, ఈసీఆర్ఎఫ్ ప్యాకేజీ పనులను రెండు ఉమ్మడి సంస్థలు[3] పొందినప్పటికీ, ఆ పనుల అమలులో విదేశీ భాగస్వాముల ప్రమేయం ఏమీ లేదు. అనుభవమున్న సంస్థగా 'ఎంప్యానెల్‌మెంట్'లో అర్హతను పొందడం కోసం మాత్రమే విదేశీ సంస్థలను బరిలోకి దించారని దీని నుండి స్పష్టమౌతోంది.

ఈ అంశాన్ని ఇంకా పరిష్కరించాల్సి ఉందని సమీక్షానంతర సమావేశంలో నీటిపారుదల శాఖ అంగీకరించింది (2012 జూలై).

*v.* ***ఎంప్యానెల్‌మెంట్ కాలపరిమితి :*** సంస్థలను ఎంప్యానెల్ చేసిననాటి (2005 జనవరి) నుండి గడచిన ఈ ఏడేళ్ల కాలంలో ఎంప్యానెల్ చేసిన సంస్థల జాబితాను ప్రభుత్వం సమీక్షించనేలేదు. ఈ మధ్యకాలంలో అర్హతను పొందిన సంస్థలను ఎంప్యానెల్ జాబితాలోకి తీసుకొని తద్వారా సంస్థల సంఖ్యను పెంచే ప్రయత్నమూ చేయలేదు.

ఈ అంశాన్ని ఇంకా పరిష్కరించాల్సి ఉందని సమీక్షానంతర సమావేశంలో నీటిపారుదల శాఖ అంగీకరించింది (2012 జూలై).

### 4.2.2 పనుల అప్పగింత

₹1,23,636 కోట్ల విలువైన 649 ప్యాకేజీల్లో[4], ₹23,771 కోట్ల (19.27 శాతం) విలువ చేసే 227 ప్యాకేజీలను[5] (35 శాతం) మాత్రమే ఎంప్యానెల్ అయిన సంస్థలకు అప్పగించారు. మిగిలిన ₹99,866 కోట్ల విలువైన 422 ప్యాకేజీలను, సంస్థలకు '**ఓపెన్ క్యాటగిరీ**' కింద అప్పగించారు. వివరాలు ఈ కింది చార్టుల్లో ఉన్నాయి.


[3] సి.ఆర్ 18జి - బి.ఎస్.సి.పి.ఎల్., హైదరాబాదులోని *సి.ఆర్ 18జి,* మధుకాన్ - సైనో - హైడ్రో, హైదరాబాద్ (ఉమ్మడిసంస్థ) లోని సైనో-హైడ్రో

[4] ఆధునికీకరణ, వరదగట్టు పనులతో సహా

[5] క్యాటగిరీ I (భారీ నీటి పారుదల) కింద 69 ప్యాకేజీలు (విలువ : ₹14549.24 కోట్లు); క్యాటగిరీ II (మధ్యతరహా నీటి పారుదల) కింద 158 ప్యాకేజీలు (విలువ : ₹9221.38 కోట్లు)


చార్టు-4.1

అప్పగించిన ప్యాకేజీల సంఖ్య




చార్టు-4.2

ఒప్పందాల విలువ (₹ కోట్లలో)




*మూలం : నీటిపారుదల శాఖ ఇచ్చిన సమాచారం నుండి రూపొందించడమైంది*

నిజానికి, సంస్థలను ఎంప్యానెల్‌మెంట్ చేసిన (2005 జనవరి) వెంటనే, 2005 మార్చిలో కల్వకుర్తి, భీమా, పోలవరం ప్రాజెక్టులకు సంబంధించిన మొత్తం ₹1,903.70 కోట్ల విలువ గల పనులను 'ఓపెన్ క్యాటగిరీ' కింద అప్పగించారు. ఉమ్మడి సంస్థలుగా తమ సామర్థ్య పటిమతో క్యాటగిరీ - I, II ల కింద ఎంప్యానెల్ అయిన 84 సంస్థలు ₹23,771 కోట్ల విలువైన పనులను పొందగా, ఆ సంస్థల్లోని భాగస్వామ్య సంస్థలే విడివిడిగా 'ఓపెన్ క్యాటగిరీ' కింద (23 కేసుల్లో) ₹7,296 కోట్ల విలువైన పనులను చేజిక్కించుకున్నాయి.

ఎంప్యానెల్‌మెంట్ చేసేప్పుడు 2 నుండి 5 ఏళ్లలోగా 26 ప్రాజెక్టులను మాత్రమే పూర్తి చేయాలని అనుకున్నామనీ, ఐతే తర్వాత ఈ ప్రాజెక్టుల సంఖ్య 46 కు, అటు తర్వాత 64 కు, 74 కు, చివరికి 86 కు పెరిగిందనీ నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది (2012 జూలై). ప్యాకేజీల సంఖ్య పెరగడం వల్లా, ఎంప్యానెల్‌మెంట్ చేసిన వాటిలో చాలా సంస్థలకు అప్పటికే మూడేసి ప్యాకేజీలను ఇచ్చేయడం వల్లా, తరవాత ప్యాకేజీ లన్నింటినీ, టెండర్లలో పాల్గొనే సంస్థల ఆర్థిక సామర్థ్యాన్ని నిర్ధారణ చేయగలిగే విధంగా '**ఓపెన్ క్యాటగిరీ**' కింద అప్పగించడం సముచితంగా భావించామని కూడా నీటిపారుదల శాఖ తెలిపింది.

భారీ ప్రాజెక్టుల కాంట్రాక్టులను అప్పగించడంలో బహిరంగ పోటీయే మెరుగైన పారదర్శక విధానమని ఆడిట్ అంగీకరిస్తోంది. ఐతే, ఎంప్యానెల్ సంస్థల జాబితాను రూపొందించి ఏడేళ్లు గడచిపోవడంతో, ఈ మధ్యకాలంలో మరిన్ని కొత్త సంస్థలు అర్హతను పొంది ఉండొచ్చు కాబట్టి, ప్రభుత్వం ఈ జాబితాను సమీక్షించుకొని మార్పులు చేర్పులు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

### 4.2.3 ఉమ్మడి సంస్థలు

'ఓపెన్ క్యాటగిరీ'లో ప్యాకేజీ పనులను దక్కించుకునేందుకు 2004-12 మధ్య కాలంలో ఎంప్యానెల్‌మెంట్ జాబితాలోని ఉమ్మడి సంస్థలు పలుమార్లు తమ భాగస్వామ్య సంస్థలను మార్చుకొని కొత్త కొత్త ఉమ్మడి సంస్థలుగా ఏర్పడ్డాయి. ఉదాహరణకు, **ప్రాణహిత - చేవెళ్ళ** ప్రాజెక్టులో ఈ కింద చూపిన విధంగా నాలుగు సంస్థలు తమ భాగస్వామ్య సంస్థలను మార్చుకొని 15 రకాల ఉమ్మడి సంస్థలుగా ఏర్పడి **₹21,843 కోట్ల** విలువైన 15 కాంట్రాక్టులను దక్కించుకున్నాయి.

### పట్టిక -4.1
### ప్రాణహిత - చేవెళ్ళ

#### మీల్

| ప్యాకేజీ సంఖ్య | గుత్తేదారు సంస్థ | ఒప్పందం విలువ (₹కోట్లలో) |
|---|---|---|
| 3 | ఎచ్‌సిసి - స్యూ - మీల్ | 639.57 |
| 5 | మీల్ - మేటాస్ - ఎబిబి - ఎంబ్రిడ్జ్ | 3626.11 |
| 7 | మేటాస్ - మీల్ - ఎబిబి - ఎఎజి | 2118.59 |
| 8 | మీల్ - స్యూ - మేటాస్ - బిఎచ్‌ఇఎల్ | 3271.09 |
| 10 | ఎచ్‌సిసి - మీల్ - బిఎచ్‌ఇఎల్ | 1928.00 |
| 11 | స్యూ - మీల్- బిఎచ్‌ఇఎల్ | 2500.53 |
| 12 | మీల్ - స్యూ - ఎబిబి - ఎఎజి | 1954.59 |
| 28 | మీల్ - జెడ్‌విఎస్ - పివిఎస్‌ఆర్‌ఎస్‌ఎన్ - ఐటిటి | 486.68 |
| మొత్తం | | 16525.16 |

#### మేటాస్

| ప్యాకేజీ సంఖ్య | గుత్తేదారు సంస్థ | ఒప్పందం విలువ (₹కోట్లలో) |
|---|---|---|
| 2 | మేటాస్ - ఎన్‌సిసి హైదరాబాద్, ఉమ్మడి సంస్థ | 215.47 |
| 4 | సుషీ హైటెక్ - ప్రసాద్ - ఎన్‌సిసి - మేటాస్ | 1675.25 |
| 5 | మీల్ - మేటాస్ - ఎబిబి - ఎంబ్రిడ్జ్ | 3626.11 |
| 7 | మీల్ - మేటాస్ - ఎబిబి - ఎఎజి ఉమ్మడి సంస్థ | 2118.59 |
| 8 | మీల్ - స్యూ - మేటాస్ - బిఎచ్‌ఇఎల్ | 3271.09 |
| 14 | ఎఎమ్‌ఆర్ - మేటాస్ - కెబిఎల్ - డబ్ల్యూఇజి | 659.27 |
| 17 | ఐటిడి సిమెంటేషన్ (ఇండియా) లిమిటెడ్ - మేటాస్ | 663.24 |
| మొత్తం | | 12229.02 |

#### స్యూ

| ప్యాకేజీ సంఖ్య | గుత్తేదారు సంస్థ | ఒప్పందం విలువ (₹కోట్లలో) |
|---|---|---|
| 3 | ఎచ్‌సిసి - స్యూ - మీల్ | 639.57 |
| 8 | మీల్ - స్యూ - మేటాస్ - బిఎచ్‌ఇఎల్ | 3271.09 |
| 11 | స్యూ - మీల్- బిఎచ్‌ఇఎల్ | 2500.53 |
| 12 | మీల్ - స్యూ - ఎబిబి - ఎఎజి | 1954.59 |
| 15 | ఎస్‌పిఎమ్‌ఎల్ - స్యూ - ఎఎమ్‌ఆర్ | 585.98 |
| 16 | పిఎల్‌ఆర్ - జివిపిఆర్ - స్యూ | 1082.98 |
| 19 | గామన్ - స్యూ | 435.89 |
| మొత్తం | | 10470.63 |

#### ఎన్‌సిసి

| ప్యాకేజీ సంఖ్య | గుత్తేదారు సంస్థ | ఒప్పందం విలువ (₹కోట్లలో) |
|---|---|---|
| 2 | మేటాస్ - ఎన్‌సిసి హైదరాబాద్, ఉమ్మడి సంస్థ | 215.47 |
| 4 | సుషీ హైటెక్ - ప్రసాద్ - ఎన్‌సిసి - మేటాస్ | 1675.25 |
| మొత్తం | | 1890.72 |

*మూలం : నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ రికార్డుల నుండి తయారు చేయడమైంది*

అదేవిధంగా, దుమ్ముగూడెం నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ ప్రాజెక్టు విషయంలో కూడా, మూడు సంస్థలు (మీల్, మేటాస్, ఎఎజి) ఉమ్మడి సంస్థలను ఏర్పాటు చేసుకొని ₹11,630.89 కోట్ల విలువైన కాంట్రాక్టులను దక్కించుకున్నాయి. ఈ మూడు సంస్థలకూ ఇతర ప్రాజెక్టుల్లో వేరే భాగస్వామ్య సంస్థలున్నాయి. ఎంప్యానెల్ క్యాటగిరీ కింద గానీ, లేదా ఓపెన్ క్యాటగిరీ కిందగానీ పలు ఉమ్మడి సంస్థల్లో భాగస్వాములుగా ఉంటూ ₹10,000 కోట్లకంటే ఎక్కువ విలువచేసే కాంట్రాక్టులతో ప్రమేయం ఉన్న సంస్థల వివరాలు ఇలా ఉన్నాయి :

### పట్టిక - 4.2

| క్రమ సంఖ్య | సంస్థ పేరు | ప్యాకేజీల సంఖ్య | సంస్థకు ప్రమేయమున్న కాంట్రాక్టుల విలువ (₹కోట్లలో) | ఉమ్మడి సంస్థల ఏర్పాటులో భాగస్వాములుగా కలుపుకున్న సంస్థల సంఖ్య |
|---|---|---|---|---|
| 1 | మీల్ | 28 | 36,916 | 23 |
| 2 | స్యూ | 51 | 25,369 | 20 |
| 3 | మేటాస్ | 28 | 23,186 | 17 |
| 4 | జెడ్‌విఎస్ | 11 | 13,989 | 17 |
| 5 | ఎఎజి | 8 | 12,981 | 8 |
| 6 | బిఎచ్‌ఇఎల్ | 5 | 12,619 | 8 |
| 7 | ఎబిబి | 7 | 11,335 | 8 |
| 8 | ఐవిఆర్‌సిఎల్ | 30 | 10,725 | 11 |

*మూలం : నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ రికార్డుల నుండి సంకలనం చేయడమైంది*

వరుస సంఖ్యలు 1, 5, 6 ఇంకా 7 లలోని సంస్థలు అసలు ఎంప్యానెల్ చేసిన సంస్థల జాబితాలోనే లేవు, కానీ ఓపెన్ క్యాటగిరీ కాంట్రాక్టులను దక్కించుకోవడం కోసం ఎంప్యానెల్ అయిన పలు సంస్థల భాగస్వాములతో ఇవి జట్టుగట్టాయి.

సంస్థలకెదురుగా చూపిన మొత్తాలు ఆయా ప్యాకేజీల్లో ఆ సంస్థల వ్యక్తిగత వాటాల విలువ కాదనీ, అవి పనుల మొత్తం విలువ అనీ నీటిపారుదల శాఖ తెలిపింది (2012 జూలై). సంస్థలు బిడ్ నిబంధనలను నెరవేరుస్తున్నంత వరకూ, ఇతరులతో కలిసి ఉమ్మడి సంస్థలుగా ఏర్పాటవడంపై ఎప్పుడూ ఆంక్షలు విధించలేదనీ, పనితీరుకు సంబంధించినంత వరకు ప్రతీ ఉమ్మడి సంస్థా చట్టబద్ధమైన ఉనికీ, గుర్తింపూ ఉన్న సంస్థ అనీ, అది మాతృసంస్థకు భిన్నమైందనీ కూడా పేర్కొంది.

ఈ మొత్తాలు సంస్థల వ్యక్తిగత వాటాలు కాదన్న వాదనతో ఆడిట్ ఏకీభవిస్తోంది. ఐతే, ఉమ్మడి సంస్థలుగా ఏర్పాటు కావడంలో ఈ సంస్థలకు సంబంధించి నిర్దిష్ట కాంట్రాక్టుల్లో ఈ సంస్థల ప్రమేయం ఏమేరకు(శాతం) ఉందో తెలిపే వివరాలను ప్రత్యేకించి కోరినప్పటికీ, నీటిపారుదలశాఖ సమర్పించని కారణంగా పై సంస్థల్లోని విడివిడి సంస్థల వ్యక్తిగత వాటాలను విశ్లేషించడం సాధ్యపడలేదు.

## 4.3 మూల్యాల అంచనా

జలయజ్ఞాన్ని చేపట్టడానికి ముందు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని పనులలో 'యూనిట్ ప్రైస్ కాంట్రాక్టు' విధానాన్ని అనుసరించేది. ఈ సాంప్రదాయక విధానంలో, గుత్తేదార్లు కోట్ చేసిన టెండరు శాతాన్ని పరిగణనలోకి తీసుకొని చెల్లింపులు చేసేవారు. ఈ విధానాన్ని ఇప్పటికీ ఇతర శాఖలు అనుసరిస్తున్నాయి. నీటిపారుదల శాఖ కూడా మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులు, నిర్వహణ పనులకు సంబంధించి ఈ పద్ధతినే అనుసరిస్తోంది.

జలయజ్ఞంలోని ఈపీసీ ఒప్పందాలు అనేక పనులతో కూడుకున్న సంకీర్ణ ఒప్పందాలు. వీటిలో గుత్తేదారులు సమగ్ర సర్వే, ఇన్వెస్టిగేషన్‌లను నిర్వహించి ప్రాజెక్టు రూపకల్పనచేసి పనులను 'టర్న్‌కీ' ప్రాతిపదికన అమలుచేయాల్సి ఉంటుంది. టెండరు వేసేటప్పుడు గుత్తేదారులు ఏకమొత్తంగా నిర్దిష్ట ధరను కోట్ చేయాలి. ఖర్చును అంచనా వేసేందుకు, గుత్తేదారులు కోట్ చేసిన ధరలను పోల్చిచూసేందుకు నీటిపారుదల శాఖ అంతర్గత అంచనాలను (ఐబీఎమ్) తయారు చేసింది. బిడ్లను మూల్యాంకనం చేసేటప్పుడు, ఐబీఎమ్ అంచనాలకు 105 శాతం కంటే అధికంగా ఉన్న బిడ్లను తిరస్కరించే మునుపటి పద్ధతినే అనుసరించింది.

ఈపీసీ కాంట్రాక్టులకు సంబంధించి అంచనాల తయారీ విషయంలో ప్రభుత్వం ఎలాంటి మార్గనిర్దేశకాలను రూపొందించ లేదు. అంచనాల తయారీ అంశాన్ని మొదట్లో సంబంధిత ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్/ఇంజనీర్స్-ఇన్-చీఫ్‌లకే వదిలేసారు. ఐతే, 2006 మేలో, ఐబీఎమ్ అంచనాలను ఖరారు చేయడం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసారు. ఐతే, వివిధ ప్రాజెక్టుల కోసం రూపొందించిన అంచనాలలో ఏకరూపత లేదు. మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టులలో ఐబీఎమ్ అంచనాలను అయిదు రకాలుగా ఎక్కువ చేసి లెక్కించారు. అవి (i) పని పరిమాణం లేదా రాశిని ఎక్కువగా అంచనా వేసుకోవడం (₹368.88 కోట్లు), (ii) పనిలోని అంశాలను ఎక్కువగా అంచనా వేయడం (₹1,649.98 కోట్లు), (iii) నీటిపారుదల రంగానికి వర్తించని సేవాపన్నుల వంటి వాటిని కలుపుకోవడం (₹684.15 కోట్లు) లేదా భారత ప్రభుత్వం వివిధ ప్రకటనల ద్వారా రాయితీ ఇచ్చిన సెంట్రల్ ఎక్సైజ్ సుంకం వంటి వాటిని అంచనాల్లో పొందుపర్చడం (₹265.23 కోట్లు), (iv) అనుమతి లేకుండానే ధరల సర్దుబాటు నిమిత్తం పొందుపర్చిన మొత్తాలు (₹108.42 కోట్లు), (v) బీమా నిమిత్తం ఎక్కువగా పొందుపర్చిన మొత్తాలు (₹52.85 కోట్లు). మచ్చుకు తనిఖీ చేసిన కేసుల్లో ఇలాంటి అంశాల కారణంగా పెంచిన ఐబీఎమ్‌ల విలువ ₹3,129.51 కోట్లు.

ఈ అంశాలను తరువాతి పేరాలలో క్లుప్తంగా చర్చించడం జరిగింది.

### 4.3.1 అసాధారణంగా పెరిగిన ప్రాజెక్టు మూల్యం

i. తొలుత దుమ్ముగూడెం నాగార్జునసాగర్ టెయిల్ పాండ్‌కు ₹8,930 కోట్లతో పరిపాలనాపరమైన ఆమోదాన్ని ఇచ్చారు (2007 మే). ఐతే, రెండేళ్లలోగానే ఈ మొత్తాన్ని పెంచి ₹19,521 కోట్లకు సవరించారు (2009 ఫిబ్రవరి). ఆయా అంశాలలోని పెరుగుదల, అందుకు పేర్కొన్న కారణాలనూ ఈ కింద పట్టికలో ఇవ్వడమైంది.

పట్టిక - 4.3

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | వివరం | తొలి మూల్యం (₹ కోట్లు) | సవరించింది (₹ కోట్లు) | పెంపు (₹ కోట్లు) | నీటిపారుదల శాఖ పేర్కొన్న కారణాలు |
|---|---|---|---|---|---|
| 1 | సొరంగం | 990 | 3776 | 2786 | ఒక సొరంగం బదులు జంటసొరంగాలను వర్తింప జేయడం, సొరంగం పొడవును 3.20 కి.మీ. పెంచడం |
| 2 | మట్టిపని - లైనింగు | 1128 | 3906 | 2778 | (i) మార్గంలో మార్పు (ii) నేల స్వభావ వర్గీకరణలో మార్పు (iii) నీటిని అందజేసే ఫీడర్ కాల్వల సంఖ్య పెంపు (iv) లైనింగు 125 మి.మీ నుంచి 150 మి.మీ.కి పెంచడం |
| 3 | ఎలక్ట్రో మెకానికల్ పనులు | 3819 | 5846 | 2027 | పంపుహౌసుల సంఖ్యను 4 నుంచి 6 కు పెంచడం, ధరల్లో మార్పు |
| 4 | క్రాస్ డ్రైనేజి పనులు | 730 | 2016 | 1286 | పూర్తిస్థాయి ఇన్వెస్టిగేషన్ తరువాత చేసిన కేటాయింపు |
| 5 | పన్నులు, ఇతర కేటాయింపులు | 78 | 2200 | 2122 | ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం |
| | పెరిగిన మూల్యం | | | 10999 | |

*మూలం : ప్రాజెక్టు రికార్డులు*

ఈ కింద పేర్కొన్న కారణాలవల్ల నీటిపారుదల శాఖ ఇచ్చిన సమాధానం అంగీకారయోగ్యం కాదు.

- పనుల పరిధి, డిజైన్లలో మార్పుల కారణంగా ప్రాజెక్టు మూల్యం పెరిగిందంటే పనుల పరిధిని మొదట్లోనే తగిన విధంగా నిర్వచించుకోలేదని తెలుస్తోంది.
- ప్రాజెక్టు సమగ్ర నివేదికను ఆమోదించిన తరవాత పనులకు టెండర్లను పిలిచిఉంటే, మూల్యం పెరగడానికి పేర్కొన్న కారణాలు ముందుగానే తెలిసి ఉండేవి. ఒకవేళ, తొలి అంచనాలను ప్రాజెక్టు సమగ్ర నివేదికలోని ప్రాజెక్టు పరిధి ఆధారంగా రూపొందించనప్పటికీ, కనీసం ప్రాజెక్టు సమగ్ర నివేదిక ఆమోదించిన తర్వాతైనా ప్రాజెక్టు మూల్యం/ పరిధిలను సవరించి ఉండాల్సింది. ఇది ప్రాజెక్టుకు సంబంధించి పనుల పరిధి, డిజైను, స్పెసిఫికేషన్ల విషయంలో స్పష్టతనిచ్చి ఉండేది. ప్రాజెక్టు అంచనా వ్యయానికి సవరణను 2009 ఫిబ్రవరిలో ఆమోదిస్తే, ప్రాజెక్టు సమగ్ర నివేదికను ఒక సంవత్సరం దాటిన తరవాత 2010 అక్టోబరులో ఖరారుచేయడం ఇక్కడ గమనార్హం.

### 4.3.2 పని పరిమాణం/రాశిని ఎక్కువగా అంచనా వేయడం

మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టుల్లోని మూడింట్లో ₹84.12 కోట్ల మొత్తానికి సంబంధించి, అవసరమైన దానికన్నా ఎక్కువగా పరిమాణాన్ని లేదా రాశిని అంచనావేసిన సందర్భాలను కింద ఇవ్వడం జరిగింది :

**పట్టిక - 4.4**

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ప్యాకేజి | అంశం | అంచనాల్లో చేర్చిన పరిమాణం | వాస్తవంగా ఆమోదించిన/చేసిన పని పరిమాణం | ఖరీదులో తేడా (₹ కోట్లలో ) |
|---|---|---|---|---|---|---|
| 1 | నెట్టెంపాడు | 108 | రెండు జలాశయాల స్టోరేజి సామర్థ్యం | 2.6 టీఎమ్‌సీ | 2.0 టీఎమ్‌సీ | 17.17 |
| 2 | హంద్రీ నీవా | ఫేజు I ప్యాకేజి 2 | పంపులు, మెటార్లు | 42 మెగావాట్లు | 39.12 మెగావాట్లు | 6.62 |
| 3 | పోలవరం | 67 | మట్టిపని | 16.62 లక్షల ఘ.మీ | 6.47 లక్షల ఘ.మీ. | 3.84 |
| 4 | పోలవరం | 67 | బ్యాంకింగ్ | 6.59 లక్షల ఘ.మీ. | 1.62 లక్షల ఘ.మీ | 2.67 |
| 5 | పోలవరం | 67 | కాంక్రీటు | 3.13 లక్షల ఘ.మీ | 0.78 లక్షల ఘ.మీ | 53.82 |
| మొత్తం | | | | | | 84.12 |

*మూలం : సంబంధిత ప్రాజెక్టుల రికార్డులు*

అంతేకాకుండా, కాంట్రాక్టుల్లో నిర్దేశించిన అంశాల్లో వాస్తవంగా అవసరంలేని, చేయని సందర్భాలు కూడా ఉన్నాయి. తొలి అంచనాలతో పోలిస్తే, ఇలాంటి అంశాల వల్ల కింద వివరించినట్టు ధరలపై ₹284.76 కోట్ల ప్రభావం పడింది.

**పట్టిక - 4.5**

| తొలి ప్రతిపాదన | అమలు చేస్తున్న పని | మొత్తం (₹ కోట్లలో) | ప్రభుత్వ సమాధానం | ఆడిట్ ప్రతిస్పందన |
|---|---|---|---|---|
| **పోలవరం (కాలువ ప్యాకేజిలు)** | | | | |
| లైనింగ్‌కు వెనుక సిఎన్ఎస్ పొర | అసలు చేయడం లేదు | 277.58 | తొలి మార్గం నల్లరేగడి నేలల నుంచి ఉంది. కాబట్టి మృత్తిక ఉబ్బడం, కుంచించుకుపోవడంలాంటి ప్రభావాన్ని తగ్గించడం కోసం లైనింగ్ కింద సిఎన్ఎస్ పొరను ప్రతిపాదించడం జరిగింది. పనిని అప్పగించాక పూర్తి స్థాయిలో సర్వే, ఇన్వెస్టిగేషన్ చేసిన తరువాత కాలువ వ్యవస్థ భద్రత దృష్ట్యా గుత్తేదారు వేరేమార్గాన్ని నిర్ణయించారు. | కాలువ భద్రత దృష్ట్యా తొలి దశల్లోనే డిపార్టుమెంటు ఇతర మార్గాలను అన్వేషించకుండా నల్లరేగడి నేలల్లో కాలువను ప్రతిపాదించి లైనింగ్ కింద సిఎన్ఎస్ పొరను ఏ పరిస్థితుల్లో చేర్చాల్సి వచ్చిందో సమాధానంలో వివరించలేదు. |
| **పోలవరం (63, 64)** | | | | |
| 900 మి.మీ.తో సిమెంటు కాంక్రీటు లైనింగు | గట్టి రాతి పొరలున్న కారణంగా 800 మి.మీ. సిమెంటు కాంక్రీటు లైనింగు | 7.18 | లైనింగు మందం తగ్గినందు వల్ల రికవరీ ప్రతిపాదనలను 2012 జూలైలో ప్రభుత్వానికి పంపించడం జరిగింది | రికవరీ ఇంకా చేయాల్సి ఉంది. |
| మొత్తం | | 284.76 | | |

*మూలం : ప్రాజెక్టు రికార్డులు*

### 4.3.3 డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలకు రకరకాల ధరలను వర్తించడం

ఒక నీటిపారుదల ప్రాజెక్టులో డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో డిస్ట్రిబ్యూటరీలు, మేజర్లు, మైనర్లు, సబ్-మైనర్లు, పంటకాల్వలు (ఫీల్డ్ ఛానెల్స్) ఉంటాయి.

మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టులలో డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలు ఉన్న 94 ప్యాకేజిలలో వాటికి పరిగణించిన ధరలను విశ్లేషించడం జరిగింది. ఈ 94 ప్యాకేజిలలో 40.02 లక్షల ఎకరాల మేర డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థకు కేటాయించిన మొత్తం ₹5,005.49 కోట్లు. అంచనాలను తయారు చేసేప్పుడు డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలకు సంబంధించిన ధరలను వాటి పనుల పరిమాణాన్ని బట్టి కాకుండా ఎకరానికి ఒక గంపగుత్త ధర చొప్పున డిపార్టుమెంటు లెక్కగట్టింది. ఇలా వివిధ ప్రాజెక్టుల్లో అనుసరించిన ధరలు, ఎకరానికి ₹4,500 నుంచి ₹16,500 వరకు ఉన్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి :

**పట్టిక - 4.6**

| సంవత్సరం | ఎకరాకు కనీస ధర (రూపాయల్లో) | ప్రాజెక్టు | ఎకరాకు గరిష్ఠ ధర (రూపాయల్లో) | ప్రాజెక్టు |
|---|---|---|---|---|
| 2004-05 | 4,856 | వంశధార స్టేజ్ II ఫేజు II, వెంకటనగరం పంపింగ్ స్కీము, భూపతిపాలెం రిజర్వాయరు ప్రాజెక్టు | 12,000 | వెలిగొండ (ప్యాకేజి IV) |
| 2005-06 | 4,700 | హంద్రీ నీవా ఫేజు II | 9,500 | రాజీవ్ దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకం |
| 2006-07 | 4,500<br>4,700 | గాలేరు నగరి (ప్యాకేజి 13)<br>హంద్రీ నీవా ఫేజు II | 12,000 | గండికోట - సిబిఆర్ లిఫ్ట్ పథకం |
| 2007-08 | 10,500 | ఎస్ఎల్‌బీసీ టనెల్ స్కీమ్ | 16,500 | ప్రాణహిత - చేవెళ్ళ |
| 2008-09 | 4,700 | హంద్రీ నీవా ఫేజు II | 16,500 | ఎల్లంపల్లి |
| 2009-10 | 8,600 | తోటపల్లి బ్యారేజి | 16,500 | దేవాదుల (ఫేజు - III) |

*మూలం : సంబంధిత ప్రాజెక్టుల రికార్డులు*

i. ఇందిరాసాగర్ దుమ్ముగూడెం పథకంలో వివిధ ప్యాకేజిల్లో డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థల కోసం వివిధ ధరలను పరిగణించారు. ప్యాకేజీలు 21, 22 లలో ఎకరాకు ₹7,500 చొప్పున గంపగుత్త ధరను పరిగణించగా, ప్యాకేజీలు 50, 51 లలో ఎకరాకు ₹9,500 చొప్పున అధిక ధరను లెక్కించారు. ఫలితంగా ఈ రెండు ప్యాకేజిల్లో అంచనా వ్యయం ₹36.20 కోట్లు పెరిగింది. ఈ రెండు ప్యాకేజీలకూ (50, 51) ఒక్కొక్క బిడ్డే దాఖలుకాగా, ఆ సింగిల్ టెండరర్లకే పనులను అప్పగించడం గమనార్హం.

ii. తెలుగుగంగ పథకంలో సిద్ధాపురం ఎత్తిపోతల పథకం కింద 21,300 ఎకరాల ఆయకట్టును సాగులోకి తీసుకుని వచ్చేందుకై ప్రభుత్వం 2007 ఏప్రిల్‌లో పరిపాలనాపరమైన అనుమతినిచ్చింది. అందులో ఎకరాకు ₹7,000 చొప్పున డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ ఖరీదును లెక్కించారు. ఐతే, తరువాత నెలలోనే అంటే, 2007 మే లో ఆమోదించిన ఐబీఎమ్ లో ఎకరాకు ₹8,000 చొప్పున ఎక్కువ ధరను పరిగణించారు. పైగా, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థకు మూల్యాన్ని లెక్కించేప్పుడు డిపార్టుమెంటు అంతకుముందే ఆయకట్టులో ఉన్న 1,000 ఎకరాలను మరిచిపోయి మొత్తం 21,300 ఎకరాలకు అభివృద్ధి వ్యయాన్ని అంచనా వేశారు. 20,300 ఎకరాల కొత్త ఆయకట్టుకు ఎకరాకు ₹7,000

చొప్పున అయ్యే డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ ఖరీదు ₹14.21 కోట్లు. ఐతే, డిపార్టుమెంటు మొత్తం (21,300 ఎకరాల ఆయకట్టుకు ఎకరాకు ₹8,000 చొప్పున) ₹17.04 కోట్లు కేటాయించింది. ఆ విధంగా అంచానాలు ₹2.83 కోట్ల మేర పెరిగాయి.

iii. 2007 ఏప్రిల్‌లో ఇచ్చిన పాలనాపరమైన ఆమోదంలో ఎకరాకు ₹7,000 ధరను తీసుకున్నారు. కానీ, అదే తెలుగు గంగ ప్రాజెక్టులోని ప్యాకేజీలు II, III ల కోసం 2004-05 లలో ఎకరాకు ₹9,300 అధిక ధరను వర్తింపజేసారు. మొత్తం 1,61,903 ఎకరాల ఆయకట్టును పరిగణనలోకి తీసుకుంటే ఈ రెండు ప్యాకేజిల్లో డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ కోసం చేసిన అంచనాల ఖరీదు కనీసం ₹37.24 కోట్లు మేర పెరిగింది.

డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలకు అయ్యే ఖర్చు ఆ పనిలో ఇమిడి ఉన్న పని రాశి మీదే కాకుండా, ఆ ప్రాంతపు మిట్టపల్లాల స్థాయి మీద, లోవ (బేసిన్) యొక్క స్వభావం మీద, ఎదురయ్యే మృత్తికల పొరల మీద, పనికి అవసరమయ్యే సిఎం-సిడి[6] పనుల మీద, కాలువకు లైనింగు ఉందా లేదా అనే పలు అంశాల మీద ఆధారపడి ఉంటాయనీ, ఇవి, ప్రాజెక్టు ప్రాజెక్టుకు మారి పోతూ ఉంటాయని, అందువల్ల ఏకరూప ధరలను వర్తింపజేయడం సాధ్యపడదని డిపార్టుమెంటు సమాధానమిచ్చింది (2012 జూలై).

ఈ కింది కారణాల వల్ల డిపార్టుమెంటు సమాధానం అంగీకారయోగ్యం కాదు :

- ఆడిట్ మచ్చుకు తనిఖీ చేసిన అంచనాల్లో కనీసం ఒక్క దానిలోనైనా డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థల ధరలు ఆ ప్రాజెక్టుకు, ప్యాకేజికి నిర్దిష్టమైన మిట్టపల్లాల స్థాయి, ఆ ప్రాంతపు మృత్తిక వర్గీకరణ వంటి పరిస్థితుల మీద ఆధారపడిలేవు.

- ప్రాణహిత - చేవెళ్ళ కింద ఉద్దేశించిన ఆయకట్టు ఆరు జిల్లాల్లో (అంటే ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి) వ్యాపించి ఉండగా, ఆ ప్రాజెక్టులోని అన్ని ప్యాకేజీలలో ఏకరీతిగా ఎకరాకు ₹16,500 ధరను వర్తింపజేసారు (2007-08). ఎల్లంపల్లి (2008-09), దేవాదుల ఫేజ్ III (2009-10) లలో కూడా ఇదే ధరను తీసుకున్నారు. ఐతే, ఈ ప్రాజెక్టుల్లో ఆయకట్టు కరీంనగర్, వరంగల్ జిల్లాలలో ఉంది.

- హంద్రీ నీవా ఫేజ్ II (ప్యాకేజీలు : 29,30,64,65) కింద చిత్తూరు జిల్లాలోని ఆయకట్టుకు వర్తింపజేసిన ధర ఎకరాకు ₹4,700. ఐతే, అదే సంవత్సరంలో (2009-10) తయారుచేసిన గాలేరు నగరి (ప్యాకేజీలు 12,14) అంచనాలలో, అదే జిల్లాలోని ఆయకట్టుకు అధిక ధర ₹9,000ను వర్తింపజేసారు.

- ఇతర ప్రాజెక్టులలోని ధరలను వర్తింపజేయాల్సిందిగా ఐబీఎమ్ కమిటీలు కూడా సిఫార్సు చేస్తూ వచ్చాయి. ఉదాహరణకు, దేవాదుల ఫేజ్ III పనులకు ప్రాణహిత - చేవెళ్ళ పథకం ధరలనూ, సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి గండికోట ఎత్తిపోతల ధరలనూ వర్తింప చేయాలని ఆదేశించారు.

### 4.3.4 వివిధ అంశాల మూల్యాన్ని అతిగా అంచనా వేయడం

ఈ దిగువ సందర్భాలలో, అంశాల ధరలకు సంబంధించి ఐబీఎమ్ అంచనాలను సరిగా లెక్కించలేదు. ఇతర ప్రాజెక్టుల్లోని ధరలతో పోల్చిచూస్తే, ఈ విధమైన తప్పుడు అంచనాలు ₹1573.71 కోట్ల మేర ప్రభావం చూపాయి.

[6] క్రాస్ మాసనరీ, క్రాస్ డ్రైనేజి

పట్టిక - 4.7

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ప్యాకేజి | అంశం | పరిగణించిన మూల్యం | ఇతర ప్రాజెక్టుల్లోని అంచనా ధర | ప్రాతిపదిక | ఖరీదులో తేడా (₹కోట్లలో) |
|---|---|---|---|---|---|---|---|
| 1 | దుమ్ముగూడెం టెయిల్‌పాండ్ | ప్యాకేజిలు 1, 4, 5, 6 | 1135.50 మెగా వాట్లకు ఎలక్ట్రో మెకానికల్ పరికరాలు | మెగావాట్‌కు ₹2.46 కోట్లు | మెగావాట్‌కు ₹2.40 కోట్లు | ప్రాణహిత - చేవెళ్ళ అంచనాలు | 68.13 |
| 2 | | ప్యాకేజిలు 1, 4, 5, 6 | ఆరు లిఫ్టులకు ఎలక్ట్రో - మెకానికల్ పరికరాలకు అనుబంధ పరికరాలు | లిఫ్టుకు* ₹136 కోట్లు | లిఫ్టుకు ₹4.25 కోట్లు | ప్రాణహిత - చేవెళ్ళ అంచనాలు | 790.50 |
| 3 | | ప్యాకేజిలు 1, 4, 5, 6 | 1, 2, 3, 6 లిఫ్టులకు ఒక్కోదానికి 8 పంపుల చొప్పున సర్జ్ భద్రతకు పరికరాలు | పంపుకు* ₹16 కోట్లు[7] | పంపుకు ₹2.50 కోట్లు | ప్రాణహిత - చేవెళ్ళ అంచనాలు | 432.00 |
| 4 | | 5/2008 | 21.25 లక్షల చ.మీ.లకు ఎం.15 లైనింగు | చ.మీ.కు ₹709 | చ.మీ.కు ₹612 | స్టాండర్డ్ డేటా | 20.61 |
| 5 | | 1 | 85 మీటర్ల వెడల్పు గల హెడ్ రెగ్యులేటర్ | ₹21 కోట్లు (2007-08 ధరలు) | ₹12.19 కోట్లు (2009-10 ధరలు) | డిపిఆర్ | 8.81 |
| 6 | | అన్ని ప్యాకేజిలు | అప్రోచ్ దారులు, చెట్ల పెంపకం | ₹146.52 కోట్లు # | ₹19.9 కోట్లు (2009-10 ధరలు) | డిపిఆర్ | 126.62 |
| 7 | హంద్రీ నీవా | ఫేజు I పనులు | 1.98 లక్షల ఎకరాలకు డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ | ఎకరానికి ₹9000 | ఎకరానికి ₹4700 | ఫేజు II | 85.14 |
| 8 | | 6, 15, 16 | సొరంగాల తవ్వకం (5.572 లక్షల ఘనపు మీటర్లు) | ఘ.మీ.కు ₹1833 | ఘ.మీ.కు ₹1081 | ఎస్ఎల్‌బీసీ ధరను ప్రామాణికంగా తీసుకుని ఏటా 10 శాతం చొప్పున పెంచగా | 41.90[8] |
| మొత్తం | | | | | | | 1573.71 |

*మూలం : సంబంధిత ప్రాజెక్టుల రికార్డులు*

** విడగొట్టకుండా, అంచనాలలో ఏకమొత్తంగా తీసుకున్నారు*

*# పనిపరిమాణాన్ని మదింపు వేయకుండా శాతంగా కేటాయింపుచేసారు*

[7] ఒక్కో లిఫ్టులోని 8 పంపులకు ₹128 కోట్లు చొప్పున

[8] ప్యాకేజి-6: ₹12.12 కోట్లు; ప్యాకేజి-15: ₹11.58 కోట్లు; ప్యాకేజి-16: ₹18.20 కోట్లు

నెట్టెంపాడు ప్రాజెక్టు ఐబీఎమ్‌లో, స్టేజి I ప్యాకేజీ అంచనాలో ఒక పేజి నుండి మరో పేజికి మొత్తాలను ముందుకు తీసుకు వెళ్లడంలోనూ, స్టేజి II ప్యాకేజీలో కూడికలలో జరిగిన తప్పులవల్ల ఆ ప్యాకేజీల అంచనాలు వరుసగా ₹13.60 కోట్లు, ₹10.20 కోట్లు మేర పెరిగిపోయాయి. అధిక ధరలతో బిడ్లను పోల్చి, ఇవ్వాల్సిన దానికంటే అధిక మొత్తాలకు పనులను అప్పగించాల్సి వచ్చేందుకు ఇలాంటి తప్పులు దోహదపడతాయి.

### 4.3.5 రాయితీ ఉన్న పన్నులను/సుంకాలను అంచనాల్లో పొందుపర్చడం

సాగునీటి ప్రాజెక్టులకు వర్తించని సేవాపన్ను, సెంట్రల్ ఎక్సైజ్ సుంకం, టర్నోవర్ పన్నులకు సంబంధించి అంచనాలలో కేటాయింపులు చేసారని ఆడిట్ తనిఖీలో వెల్లడైంది. వివరాలు ఈ కింద ఉన్నాయి.

#### *4.3.5.1 సేవా పన్ను*

1994 ఆర్థిక చట్టంలోని అధ్యాయం - V, అందులో పేర్కొన్న నియమాల ప్రకారం నీటిపారుదల ప్రాజెక్టులకు, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు చేయూతనివ్వని నిర్మాణ సేవలకు, సేవాపన్ను వర్తించదు. ఐతే, మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టుల్లోని కొన్ని ప్యాకేజీల ఐబీఎమ్ అంచనాల్లో ఈ అంశం కోసం భారీ మొత్తాలను పొందుపర్చడం జరిగింది. వివరాలిలా ఉన్నాయి :

పట్టిక - 4.8

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ప్యాకేజి | అంచనాలో పొందుపర్చిన మూల్యం (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 1 | ప్రాణహిత - చేవెళ్ళ | 3 | 0.36 |
| 2 | | 4 | 59.61 |
| 3 | | 5 | 50.13 |
| 4 | | 6 | 93.26 |
| 5 | | 7 | 29.15 |
| 6 | | 8 | 92.10 |
| 7 | | 9 | 17.94 |
| 8 | | 10 | 51.30 |
| 9 | | 11 | 67.31 |
| 10 | | 12 | 51.39 |
| 11 | | 13 | 18.80 |
| 12 | | 20 | 15.47 |
| 13 | | 21 | 30.00 |
| 14 | | 22 | 45.28 |
| 15 | ఎల్లంపల్లి | స్పిల్‌వే గేట్లు | 6.81 |
| 16 | దేవాదుల | ఫేజ్ III ప్యాకేజి I | 37.26 |
| 17 | | ఫేజ్ III ప్యాకేజి II | 2.49 |
| 18 | | ఫేజ్ III ప్యాకేజి III | 15.49 |
| మొత్తం | | | 684.15 |

*మూలం : సంబంధిత ప్రాజెక్టుల రికార్డులు*

### 4.3.5.2 అమ్మకం పన్నును కలిపిన తరువాత కూడా టర్నోవరు పన్నును కలపడం

అమ్మకం పన్ను వర్తించే సందర్భాల్లో టర్నోవరు పన్ను వర్తించదు. ఐతే, నెట్టెంపాడు ప్రాజెక్టు ఐబీఎమ్ అంచనాల్లో 4 శాతం చొప్పున అమ్మకం పన్నును కలపడంతో పాటు, ₹11.80 కోట్ల టర్నోవరు పన్నును కూడా కలిపారు.

### 4.3.5.3 సెంట్రల్ ఎక్సైజు

వ్యవసాయ, పారిశ్రామిక వినియోగం కోసం ఉద్దేశించిన నీటి సరఫరా పథకాల ఏర్పాటుకు అవసరమైన యంత్రాలు, పరికరాలు, పైపులు వంటి అన్ని అంశాలకు సెంట్రల్ ఎక్సైజు నుంచి రాయితీని ఇస్తూ భారత ప్రభుత్వం 2004 జనవరిలో ఒక నోటిఫికేషన్‌ను జారీచేసింది. ఐతే, ఈ కింద చూపిన పనుల విషయంలో సెంట్రల్ ఎక్సైజు కోసం ₹149.70 కోట్ల మేర భారీ మొత్తాలను అంచనాల్లో పొందుపరిచారు.

పట్టిక - 4.9

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ప్యాకేజి | కలిపిన సెంట్రల్ ఎక్సైజు (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 1 | నెట్టెంపాడు | లిఫ్ట్ I | 31.98 |
| 2 | | లిఫ్ట్ II | 24.85 |
| 3 | దేవాదుల | ఫేజ్ I స్టేజి I | 54.27 |
| 4 | | ఫేజ్ II ప్యాకేజి | 38.60 |
| మొత్తం | | | 149.70 |

*మూలం : సంబంధిత ప్రాజెక్టుల రికార్డులు*

- వెలిగొండ ప్రాజెక్టులోని ప్యాకేజి 5 లో టనెల్ బోరింగ్ మెషీన్, ఎలక్ట్రో మెకానికల్ పరికరాల వంటి వాటిని కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. నీటి సరఫరా కోసం కొనుగోలు చేసిన పరికరాలకు సెంట్రల్ ఎక్సైజ్ సుంకాల నుండి మినహాయింపు ఉంది (2004 జనవరి). ఐతే, ఐబీఎమ్ అంచనాల్లో (₹715.95 కోట్లు) సెంట్రల్ ఎక్సైజ్ పేరిట ₹115.53 కోట్లను కలిపారు (2007 ఫిబ్రవరి).

కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ సుంకాల నుంచి మినహాయింపు ఉందన్న విషయం తమ అధికారులకు తెలియదని నీటి పారుదలశాఖ పేర్కొంది. ఐతే, ఈ కింది కారణాల వల్ల సమాధానం ఆమోదయోగ్యంకాదు.

- భారత ప్రభుత్వం ఈ మినహాయింపును ఇచ్చి మూడేళ్ళు దాటిపోయింది. నీటి పారుదలశాఖ కూడా అంచనాల తయారీకి సంబంధించి అవసరమయ్యే అన్ని ఆదేశాలను/ఉత్తర్వులను తెలుసుకుని ఉండాలి ;
- గుత్తేదారు సంస్థ ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు దాఖలు చేసిన ఒక అఫిడవిట్‌ను బట్టి బిడ్ వేసేప్పుడు అందుబాటులో ఉన్న మినహాయింపులను పరిగణించినట్లు పేర్కొనడాన్ని చూస్తే గుత్తేదారుకు మినహాయింపుల విషయం తెలుసని స్పష్టమౌతోంది.
- మినహాయింపు ఉన్న సుంకాలను ఐబీఎమ్‌లో చేర్చడం వల్ల బిడ్ల మూల్యాంకనం సరిగ్గా జరుగదు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అంచనాలకు 5 శాతం పరిమితినిదాటిన టెండర్లను తిరస్కరించాల్సి ఉన్నప్పటికీ, మినహాయింపు ఉన్న సుంకాలను కలపడంతో ఐబీఎమ్ విలువ పెరిగిపోయి, పరిమితిలోకి రాని బిడ్లను కూడా అంగీకరించాల్సి వచ్చింది.

జలయజ్ఞంలో ఇతర ప్రాజెక్టులన్నింటికీ ఈ మినహాయింపు వర్తిస్తుంది కనుక ప్రభుత్వం అన్నింటి మీద ఈ కోణంలో దృష్టి సారించాల్సి ఉంది.

### 4.3.6 పనులకు బీమా కవరేజి

పని విలువ మీద కొంత శాతం చొప్పున లెక్కించి బీమా ప్రీమియంల కోసం అధిక మొత్తాలను పొందుపర్చడం వల్ల పలు ప్రాజెక్టుల్లో ఐబీఎమ్ విలువలు పెరిగిపోయాయి. టెండర్లను ఆహ్వానిస్తూ ఇచ్చిన ప్రకటన (ఎన్ఐటి) లోనూ, ఒప్పందం నిబంధనల్లోనూ గుత్తేదారు సంస్థ మొత్తం పనికి కాంట్రాక్టు గడువు కాలంలో పూర్తిగా అన్ని రిస్కులను భరించే విధంగా బీమాను కల్పించాలని నిర్దేశించడమైంది.

ఇందుకు సంబంధించి ఆడిట్ పరిశీలనలు ఇలాఉన్నాయి ః

i. ఐబీఎమ్ అంచనాల్లో బీమా మొత్తాన్ని కలిపే ముందు నీటి పారుదలశాఖ వివిధ బీమా సంస్థల నుంచి కొటేషన్లను తెప్పించుకోలేదు. ఆ విధంగా ఐబీఎమ్‌లలో డిపార్టుమెంటు కలిపిన మొత్తానికీ, గుత్తేదారు సంస్థలు బీమా కోసం చెల్లించిన ప్రీమియానికీ మధ్య చాలా తేడా ఉంది. కొన్ని ప్రాజెక్టుల్లో వార్షికంగా అయ్యే నిర్మాణ వ్యయం ఆధారంగా బీమా కాల అవధిని బట్టి బీమా మొత్తాన్ని లెక్కించి అంచనాల్లో కలిపితే మరి కొన్నింటిలో బీమా కాల వ్యవధితో సంబంధం లేకుండా నేరుగా కొంత శాతాన్ని లెక్కించారు. మచ్చుకు కొన్ని దస్త్రాలు పరిశీలించగా, ఈ దిగువ వ్యత్యాసాలు వెలుగు చూశాయి.

పట్టిక - 4.10

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ప్యాకేజి | ప్రభుత్వ అంచనా | కాంట్రాక్టర్లు వాస్తవంగా చెల్లించిన ప్రీమియం | వ్యత్యాసం |
|---|---|---|---|---|---|
| 1 | దుమ్ముగూడెం-నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ | 10 ప్యాకేజిలు | 72.86 | 36.49 | 36.37 |
| 2 | ఇందిరా సాగర్ దుమ్ముగూడెం | 6 ప్యాకేజిలు | 8.54 | 1.99 | 6.55 |
| 3 | ఎల్లంపల్లి | 7 ప్యాకేజిలు | 8.13 | 1.34 | 6.79 |
| 4 | రాజీవ్ దుమ్ముగూడెం | 1/1 | 3.12 | 0.82 | 2.30 |
| 5 | కొమరంభీం | ఒకే ప్యాకేజి | 1.74 | 0.90 | 0.84 |
| మొత్తం | | | | | 52.85 |

*మూలం ః సంబంధిత ప్రాజెక్టుల రికార్డులు*

ii. వివిధ ప్రాజెక్టులు/పనుల్లో అంచనాలను తయారు చేసేటప్పుడు బీమా మొత్తాన్ని లెక్కించడంలో ఏకరూపత లేదు. ఎస్ఎల్‌బీసీ టనెల్ ప్యాకేజీలో ఏడేళ్ల కాలానికి[9] సగటున సాలుకు 0.004 శాతం చొప్పున మొత్తం పని విలువపై 0.028 శాతం మేర కేటాయింపులు జరిగాయి. మరోవైపు నెట్టెంపాడులో రెండు లిఫ్ట్ ప్యాకేజీలలో సగటున సాలుకు 0.04 శాతం చొప్పున ఆరేళ్ల బీమా అవధికి 2.4 శాతం మేర లెక్కగట్టడం జరిగింది. అదే పథకంలోని 99 నుంచి 109 వరకు ప్యాకేజిలలో రెండేళ్ల నిర్మాణ కాలానికి, అటు తరువాత రెండేళ్ల నిర్వహణ కాలానికి 0.345 శాతంగా బీమా ప్రీమియాన్ని లెక్కించడం జరిగింది.

[9] ఒప్పందం గడువు ఐదేళ్లు, నిర్వహణ కాలం రెండేళ్లు

iii. ప్రాణహిత - చేవెళ్ళలోని 26 ప్యాకేజీల్లో 0.525 శాతం చొప్పున, రెండు ప్యాకేజీల్లో 0.37 శాతం చొప్పున బీమా కోసం ఐబీఎమ్‌లలో లెక్కలు వేశారు. ఐతే, కాంట్రాక్టర్లతో అంగీకారం కుదిరిన పేమెంటు షెడ్యూళ్లలో మాత్రం 0.08 శాతం నుంచి 0.5 శాతం వరకు విభిన్నమైన శాతాలున్నాయి. ఐబీఎమ్‌లలో లెక్కించిన మొత్తాలకు, చెల్లింపు షెడ్యూళ్లకు మధ్య తేడా ₹93.40 కోట్లు.

iv. ఎల్లంపల్లి ప్రాజెక్టులో పనులకు నష్టం వాటిల్లిన సందర్భంలో కూడా ప్రభుత్వం బీమా ప్రయోజనాన్ని పొందలేక పోయింది. 2010 సెప్టెంబరులో భారీ వరద కారణంగా ఈ ప్రాజెక్టులోని ఒక పనిలో పగులు ఏర్పడింది. 2010 జూలై నుండి పనులు ఆగిపోయిన దృష్ట్యా, పగులు ఉన్న భాగంతోసహా కొంత మేర పనిని గుత్తేదారు సంస్థ నుండి తప్పించి (2011 జనవరి 19) మరో గుత్తేదారుకు అప్పగించారు. కాగా, 2011 జనవరి 31 నాటికి బీమా గడువు దాటి పోవడంతో, ₹2.67 కోట్లుగా అంచనా వేసిన నష్టాల మొత్తాన్ని నీటి పారుదలశాఖ క్లెయిమ్ చేయలేకపోయింది. 2012 జూలై నాటికి, పగులును పూడ్చడమూ జరగలేదు, నష్టభారాన్ని తిరిగి పొందనూలేదు.

బీమా సంస్థ వద్ద క్లెయిమ్‌ను దాఖలు చేశామనీ, పగులును పూడ్చే పని జరుగుతోందనీ నీటిపారుదల శాఖ తెలిపింది (2012 జూలై).

### 4.3.7 ధరల సర్దుబాటు/ధరల పెరుగుదల గురించి మొత్తాలను అంచనాల్లో చేర్చడం

మచ్చుకు తనిఖీ చేసిన ఈ కింది ప్యాకేజీల ఐబీఎమ్ అంచనాల్లో '**ధరల పెరుగుదల**' పేరుతో భారీ మొత్తాలను చేర్చారు.

పట్టిక - 4.11

| ప్రాజెక్టు | ప్యాకేజీ సంఖ్య | ధరల పెరుగుదల కోసం అంచనాల్లో చేర్చిన మొత్తం (₹ కోట్లలో) |
|---|---|---|
| గాలేరు నగరి | 1 | 14.83 |
| | 2 | 13.78 |
| | జికెఎల్ -1 | 33.79 |
| | 47 | 10.30 |
| | 48 | 5.34 |
| | 49 | 5.15 |
| పులివెందుల బ్రాంచ్ కాలువ | 92 | 1.99 |
| | 93 | 3.57 |
| తెలుగుగంగ పథకం | ప్యాకేజీ II | 7.62 |
| | ప్యాకేజీ III | 8.78 |
| | 50 | 3.27 |
| మొత్తం | | 108.42 |

*మూలం : సంబంధిత ప్రాజెక్టుల రికార్డులు*

ఐబీఎమ్‌లలో 'ధరల పెరుగుదల' కోసం మొత్తాలను చేర్చడానికి గల కారణాలను నమోదు చేయలేదు. అంచనాల్లో ధరల పెరుగుదల కోసం అదనపు మొత్తాలను కలపడాన్ని ఆమోదిస్తూ ప్రభుత్వం నుండి ప్రత్యేకమైన ఆదేశాలేవీ దస్త్రాలలో లభించలేదు. అంతే కాకుండా, మచ్చుకు తనిఖీ చేసిన ఇతర ప్రాజెక్టుల అంచనాలలో ధరల పెరుగుదల కోసం ఇలా కేటాయింపులు చేయలేదు. రాయలసీమ ప్రాంతంలోని ఈ ప్రాజెక్టుల్లో ఇలాంటి కేటాయింపులు చేయడానికి గల కారణాలు స్పష్టం కావటంలేదు.

### 4.3.8 ఐబీఎమ్‌లను ఖరారు చేయడంలో జాప్యం

i. ఐబీఎమ్ అంచనాలను ఖరారు చేయడంలో విపరీతమైన జాప్యాలు జరిగాయి. ముఖ్యంగా వెలిగొండ, ప్యాకేజీ - 6 (తూర్పు ప్రధాన కాలువ)లో అయితే 2008 నవంబరు 4న టెండర్లు ఆహ్వానించారు. ధరల బిడ్‌ను తెరవాల్సిన గడువు తేది 2008 డిసెంబరు 22. ఐతే, ఈ గడువు తేదిని ఆరు సార్లు పొడిగించారు. చివరి సారిగా గడువును 2009 ఫిబ్రవరి 3 వరకు పొడిగించారు. కమిటీ ఐబీఎమ్ విలువను ఖరారు చేయనందువల్లనే ఇలా వాయిదా పడింది. కమిటీలు పలుసార్లు ఐబీఎమ్ విలువలను కూడా మార్చాయి.

ప్యాకేజి 6 చాలా సంక్లిష్టమైందనీ, అందులో స్టేజ్ I, స్టేజ్ II ల పనులను సమన్వయం చేసుకోవాల్సి వస్తుందనీ, అందువల్లనే ఐబీఎమ్ విలువలను ఖరారు చేయడానికి కమిటీకి సమయం పట్టిందనీ డిపార్టుమెంటు సమాధానమిచ్చింది (2012 జూలై). టెండర్లు పిలవక ముందే ఐబీఎమ్ విలువలను జాగ్రత్తగా ఖరారు చేయడం ముఖ్యమనే ఆడిట్ వాదనకు ఈ సమాధానం ఊతమిస్తోంది.

ii. తెలుగుగంగ ప్రాజెక్టుదీ అదే పరిస్థితి. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రిజర్వాయరుకు సంబంధించిన ఎడమ, కుడి కాల్వలకు లైనింగు ప్యాకేజిలకు పరిపాలనపరమైన ఆమోదాన్ని ఇచ్చేప్పుడు, టెండర్లు పిలిచేముందే ఐబీఎమ్‌లను కమిటీలు పరిశీలించాలని ప్రభుత్వం ప్రత్యేకంగా పేర్కొంది (2008 ఏప్రిల్, 2009 ఫిబ్రవరి). ఐతే, ఈ రెండు పనులకు ఐబీఎమ్ కమిటీ ఆమోదం లేకుండానే 2009 ఆగస్టు 21 న రాయలసీమ సాగునీటిపారుదల శాఖ (ప్రాజెక్టులు) కార్యదర్శి ఇచ్చిన ఆదేశాల మేరకు టెండర్లు పిలిచారు (2009 సెప్టెంబరు 8). వీటి ఐబీఎమ్ విలువలు 2009 నవంబరు 6 న ఆమోదించారు. ధరల బిడ్లు 2009 నవంబరు 30న తెరచి, 2010 ఏప్రిల్ 7న గుత్తేదారుతో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. పాలనాపరమైన అనుమతి 2010 మార్చి 30న సవరించారు. అంచనాలను 2010 ఏప్రిల్ 7 న సాంకేతికంగా మంజూరుచేశారు.

ఈపీసీ కాంట్రాక్టింగ్ విధానంలో ఐబీఎమ్‌ను ఖరారు చేయడం చాలా కీలకమైనదనీ, ఐబీఎమ్‌ను టెండరు ప్రక్రియ సమయంలో ఖరారు చేశామనీ డిపార్టుమెంటు సమాధానమిచ్చింది. అంతేగాకుండా, పనులను పూర్తి చేయాలనే తొందరలోనూ, పెద్ద సంఖ్యలోని పనుల వల్ల, టెండర్లను పిలిచిన తరువాత సాంకేతిక మంజూరీ ఇవ్వడం జరిగిందని కూడా తెలిపింది.

టెండర్లు పిలవడంకన్నా ముందుగానే ఐబీఎమ్‌లను ఖరారు చేయాలన్న ఆడిట్ వాదనను ఈ సమాధానం బలపరుస్తోంది.

## 4.4 టెండర్ల ప్రక్రియ

### 4.4.1 సాంకేతిక మంజూరీ లేకుండా టెండర్లు పిలవడం

2006 ఫిబ్రవరిలో ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వుల[10] ప్రకారం *"సాంకేతిక మంజూరీ లేకుండా టెండర్లు పిలిచిన సందర్భాల్లో, ప్రతిపాదనలు పంపితే ఆ విధంగా టెండర్లు పిలిచిన చర్యకు ప్రభుత్వం చర్యానంతర ఆమోదం తెలుపుతుంది"*. టెండర్లు పిలవడానికి ముందే సాంకేతిక మంజూరీ తీసుకోవడం అనేదే సక్రమమైన చర్య అనీ, దానిని అతిక్రమించిన సందర్భాల్లో ప్రభుత్వం నుంచి చర్యానంతర ఆమోదం అవసరం అనీ ఇది సూచిస్తోంది.

---

[10] 5217/రిఫార్మ్స్/06, తేది 23.02.2006

i. మచ్చుకు తనిఖీ చేసిన 180 ప్యాకేజిలకుగాను, 21 ప్రాజెక్టులకు సంబంధించిన 143 ప్యాకేజిల విషయంలో సాంకేతిక మంజూరి ఇవ్వడం లేదా పని విలువను ఖరారు చేయడం కన్నా ముందే టెండర్లను పిలవడం జరిగింది.

ii. 14 ప్రాజెక్టులకు సంబంధించిన 66 ప్యాకేజిల్లో బిడ్లను తెరిచిన తరువాత సాంకేతిక మంజూరీ ఇవ్వడం జరిగింది.

పని వాస్తవంగా మొదలుపెట్టడానికి ముందు అంటే ఒప్పందం మీద సంతకం చేయడానికి ముందు సాంకేతిక మంజూరీ తప్పనిసరి అనీ, ఆడిట్ పేర్కొన్న అన్ని సందర్భాల్లోనూ ఒప్పందం తేదీ కన్నా ముందు, పని ప్రారంభించడానికన్నా ముందే సాంకేతిక మంజూరీ ఇచ్చామని డిపార్టుమెంటు సమాధానమిచ్చింది. ఎస్ఎల్బీసీ సొరంగం (1), హంద్రీ నీవా (12), దేవాదుల (3), ఎల్లంపల్లి (2) ప్రాజెక్టుల్లోని 18 ప్యాకేజీల విషయంలో **ఒప్పందాలు కుదుర్చుకున్న తరువాత సాంకేతిక మంజూరీ ఇవ్వడం జరిగింది** కాబట్టి ఈ సమాధానం వాస్తవాలకు భిన్నంగా ఉంది.

ఈపీసీ విధానంలో సాంకేతిక మంజూరీ అనేది కేవలం ఒక శాఖాపరమైన సంప్రదాయమనీ, దానికి అంత ప్రాముఖ్యం లేదనీ, ఐబీఎమ్ విలువలను నిర్ధారించడమే ముఖ్యమైందనీ కూడా ప్రభుత్వం తెలిపింది. ఐతే, పనిలోని ప్రతి అంశానికీ స్పష్టమైన, ఆమోదం ఉన్న అంచనాలు లేకుంటే, పరిమాణంలో లేదా రాశిలో తేడాలు వచ్చే అవకాశాలు చాలా ఎక్కువ. అంతేకాకుండా, మునుపటి పేరాలలో చెప్పినట్టుగా, ఐబీఎమ్ అంచనాలను సమయానికి ఖరారు చేయలేదు.

### 4.4.2 బిడ్లను తెరవడం/అంగీకరించడంలో జాప్యాలు

ప్రభుత్వం ఈపీసి కాంట్రాక్టు విధానాన్ని అనుసరించడానికి గల కారణాల్లో, బిడ్ల ఆమోదానికి పట్టే సమయాన్ని తగ్గించడం ఒకటి. మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టుల్లో టెండరు ప్రక్రియను ఆడిట్ సమీక్షించగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

i. 16 ప్రాజెక్టులలోని[11] 63 ప్యాకేజిల్లో టెండర్లను ఖరారు చేసేందుకు డిపార్టుమెంటు బిడ్లను సమర్పించాల్సిన చివరి తేది నాటి నుంచి 90 రోజులకు పైగా సమయం తీసుకుంది.

ii. మూడు ప్రాజెక్టులకు[12] చెందిన 14 ప్యాకేజిల్లో బిడ్ వేసేందుకు ఇచ్చిన సమయంకన్నా బిడ్‌ను తెరిచేందుకు తీసుకున్న సమయమే ఎక్కువ. నెట్టెంపాడులో అయితే బిడ్లను తెరిచేందుకు **52 రోజుల** సమయం తీసుకున్నారు. మరోవైపు, ఈ ప్రాజెక్టులోని 14 ప్యాకేజిలకుగానూ 12 ప్యాకేజిల్లో బిడ్‌లు సమర్పించేందుకు 35 రోజులు గడువు మాత్రమే ఇచ్చారు.

iii. 12 ప్రాజెక్టులకు[13] సంబంధించి 66 ప్యాకేజిల్లో బిడ్ వేసేందుకు ఇచ్చిన సమయం కన్నా బిడ్‌ను ఆమోదించేందుకు తీసుకున్న సమయమే ఎక్కువ.

iv. ఈ కింది సందర్భాల్లో బిడ్లను అంగీకరించేందుకు 6 నెలలకు పైగా జాప్యం జరిగింది :

[11] నెట్టెంపాడు (11), హంద్రీ నీవా (10), దుమ్ముగూడెం టెయిల్ పాండ్ (6), రాజీవ్ దుమ్ముగూడెం (5), ఇందిరాసాగర్, దుమ్ముగూడెం (4), దేవాదుల (4), పులివెందుల (4), ఎల్లంపల్లి (4), తెలుగుగంగ (4), ఎస్ఎల్బీసీ సొరంగం (2), గాలేరు నగరి (2), పోలవరం (2), వెలిగొండ (2), భూపతిపాలెం, ప్రాణహిత-చేవెళ్ల, సోమశిల ప్రాజెక్టుల్లో ఒక్కొక్క ప్యాకేజి

[12] నెట్టెంపాడు (12), దేవాదుల, ఎల్లంపల్లిలలో చెరొకటి

[13] హంద్రీ నీవా (12), నెట్టెంపాడు (11), పులివెందుల (7), రాజీవ్ దుమ్ముగూడెం (7), దుమ్ముగూడెం టెయిల్ పాండ్ (6), ఎల్లంపల్లి (5), వెలిగొండ, తెలుగుగంగ, గాలేరునగరి, దేవాదులలలో నాలుగు చొప్పున, ఎస్ఎల్బీసీ సొరంగం, సోమశిలల్లో ఒక్కొక్కటి

**పట్టిక - 4.12**

| ప్రాజెక్టు | ప్యాకేజి | బిడ్లను సమర్పించాల్సిన ఆఖరు తేదీ | బిడ్‌ను అంగీకరించిన తేదీ | బిడ్‌ను సమర్పించిన నాటి నుంచి అంగీకరించే వరకు పట్టిన సమయం (రోజుల్లో) |
|---|---|---|---|---|
| గాలేరు నగరి | 31 | 29/09/2006 | 19/04/2007 | 202 |
| పోలవరం | ఈపిఆర్ఎఫ్ | 12/01/2006 | 14/07/2006 | 183 |
| | ఓపి-8 | 19/04/2005 | 31/12/2005 | 256 |
| దేవాదుల | అశ్వారావుపల్లి ట్యాంకు | 14/03/2006 | 11/01/2007 | 303 |
| | ఫేజ్ III లో II | 08/08/2008 | 13/02/2009 | 189 |
| | ఆర్ఎస్‌ఘన్పూర్ ట్యాంకు | 14/03/2006 | 11/01/2007 | 303 |
| | తపాస్‌పల్లి ట్యాంకు | 14/03/2006 | 11/01/2007 | 303 |
| నెట్టెంపాడు | 99 | 15/02/2005 | 21/10/2005 | 248 |
| | 100 | 15/02/2005 | 21/10/2005 | 248 |
| | 101 | 15/02/2005 | 19/08/2005 | 185 |
| | 102 | 15/02/2005 | 19/08/2005 | 185 |
| | 103 | 15/02/2005 | 19/08/2005 | 185 |
| | 104 | 15/02/2005 | 21/10/2005 | 248 |
| | 106 | 15/02/2005 | 21/10/2005 | 248 |
| | 107 | 15/02/2005 | 21/10/2005 | 248 |
| | 108 | 15/02/2005 | 19/08/2005 | 185 |
| | 109 | 15/02/2005 | 19/08/2005 | 185 |
| పులివెందుల | 92 | 15/02/2005 | 24/10/2005 | 251 |
| రాజీవ్ దుమ్ముగూడెం | 1/1 | 25/01/2007 | 28/03/2008 | 428 |
| సోమశిల | 11 | 05/05/2008 | 23/12/2008 | 232 |
| ఎల్లంపల్లి | కాలువ వ్యవస్థ ప్యాకేజి 1 | 28/08/2008 | 02/03/2009 | 186 |

*మూలం : సంబంధిత ప్రాజెక్టుల రికార్డులు*

జాప్యాలు పాలనాపరమైనవంటూ ప్రభుత్వం సమర్థించుకుంది (2012 జూలై). పోలవరంకు సంబంధించినంతవరకు బిడ్ మూల్యాంకన నివేదికను తొలుత రాష్ట్రస్థాయి సంఘానికీ, అటు తరువాత హైపవర్ కమిటీకి సమర్పించడంవల్ల, వచ్చిన ఏకైక బిడ్‌ను అంగీకరించడంలో ఆలస్యమైందని పేర్కొంది. ఇతర ప్రాజెక్టుల విషయంలో బిడ్డర్లకు సంబంధించిన సాంకేతిక అంశాలు, అనుభవం వంటి వాటిని వివిధ కమిటీలు క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందనీ, కాబట్టి బిడ్లను అంగీకరించేందుకు నిర్ణీత గడువును విధించలేమని సాగునీటిపారుదల శాఖ తెలిపింది.

ఈ కింది కారణాల వలన ఈ సమాధానం అంగీకారయోగ్యం కాదు.

- ప్రభుత్వం బిడ్డింగ్‌కు తక్కువ సమయం ఇచ్చి, బిడ్లను పరిశీలించి, ఆమోదించేందుకు మాత్రం ఎక్కువ సమయం తీసుకుంది. ఫలితంగా బిడ్ వేసిన తరువాత సర్దుబాట్లకు ఆస్కారం ఉంటుంది.
- ప్రాజెక్టులను రెండు నుండి ఐదేళ్ల వ్యవధిలో పూర్తి చేయడం కోసం జలయజ్ఞం చేపట్టారు. ఐతే, బిడ్లను పరిశీలించి ఆమోదించేందుకే ఆరు నెలల నుండి సంవత్సరం వరకూ సమయాన్ని తీసుకుంటే, ఈ కార్యక్రమం చేపట్టిన ఉద్దేశం నీరుగారిపోతుంది.

### 4.4.3 'సింగిల్ బిడ్డర్లకే' కాంట్రాక్టుల అప్పగింత

i. మచ్చుకు తనిఖీ చేసిన 15 ప్రాజెక్టుల్లోని 36 ప్యాకేజీల్లో, సింగిల్ బిడ్డర్లకే పనులను అప్పగించారు (***అనుబంధం 4.2***). ఇలా అప్పగించిన పనుల విలువ ₹7,856.11 కోట్లు.

ii. 12 ప్రాజెక్టుల్లోని 31 ప్యాకేజీల్లో ఒక్కొక్క బిడ్డరు మాత్రమే ఐబీఎమ్‌తో పోల్చినప్పుడు నిర్దేశిత గరిష్ఠపరిమితి అయిన ఐదు శాతం కన్నా తక్కువకు టెండరు వేశారు. అలా అంగీకరించిన డీమ్డ్ సింగిల్ బిడ్ల విలువ ₹10,009.14 కోట్లు.

iii. 15 ప్రాజెక్టులకు చెందిన 52 ప్యాకేజీల్లో కేవలం రెండేసి బిడ్లతో పోటీ చాలా స్వల్పంగా ఉంది. అలా స్వల్ప పోటీల నడుమ అప్పగించిన పనుల విలువ ₹34,169.49 కోట్లు.

సింగిల్ టెండర్లను అంగీకరించడానికి ప్రభుత్వం పలు కారణాలను తెలిపింది - (i) అంతకు ముందు ఇచ్చిన టెండరు ప్రకటనలకు ప్రతిస్పందన స్వల్పంగా ఉంది, (ii) ఒకవేళ డిస్కౌంటుతో ఉన్న సింగిల్ టెండర్లను అంగీకరించకపోతే, తరువాత సవరించిన ధరలతో ఇచ్చే ప్రకటనల కారణంగా ప్రభుత్వం ఎక్కువ మొత్తాలను చెల్లించాల్సి రావచ్చు, (iii) పనిచేయాల్సిన ప్రాంతం, దాని నైసర్గిక స్వరూపం సంస్థలకు అనుకూలంగా లేకపోవచ్చు.

### 4.4.4 టెండరు వేసాక మార్పులు

ఈ కింది సందర్భాల్లో, బిడ్లను తెరచిన తరవాత ఐబీఎమ్ విలువలను సవరించారని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది.

i. పోలవరం ప్యాకేజి ఎల్ఎంసి-8 లో బిడ్‌ను తెరిచిన (2005 ఏప్రిల్ 25) తరువాత టెండరు నిబంధనల ప్రకారం ఐదు శాతం దాటితే తిరస్కరణకు గురయ్యే ప్రమాదాన్ని నివారించేందుకుగాను సింగిల్ బిడ్డరు తన బిడ్ మొత్తాన్ని ₹4.88 కోట్ల మేర (అంటే ₹118.26 కోట్ల నుంచి ₹113.38 కోట్లకు) తగ్గించడంతో (2005 ఆగష్టు 27) టెండరు ప్రీమియం శాతం 9.49 నుంచి 4.97 శాతానికి తగ్గింది. 2005 ఆగష్టు 30 న బిడ్ మూల్యాంకన నివేదిక తయారు చేయడాన్ని బట్టి చూస్తే సింగిల్ బిడ్డరు రిబేటు ఇచ్చే వరకూ డిపార్టుమెంటు నాలుగు నెలలపాటు వేచి చూసిందని అర్థమౌతోంది.

ii. హంద్రీ నీవా ప్రాజెక్టులోని ఫేజ్ I కింద మెకానికల్ ప్యాకేజికి టెండరు ప్రకటన 2005 జూన్ 29 న జారీ చేశారు. టెండర్లు అందుకోడానికి చివరి తేది 2005 నవంబరు 11. వేలంలో మూడు సంస్థలు పాల్గొన్నాయి. సాంకేతిక పరిశీలనలో ఒక సంస్థ తిరస్కరణకు గురికాగా మరో రెంటి బిడ్లను తెరిచారు. రెండు సంస్థలూ నిర్దేశిత పరిమితి అయిన 5 శాతం కన్నా ఎక్కువగా టెండరు వేశాయి కనుక రెంటినీ తిరస్కరించి ఉండాల్సింది. ఐతే, ఐవిఆర్‌సిఎల్ లిమిటెడ్ అనే సంస్థ వరుసగా రెండుసార్లు, 2005 డిసెంబరు 27 న 2.25 శాతం, మళ్లీ 2005 డిసెంబరు 28న 3.93 శాతం రిబేటునిచ్చి తన టెండరు ప్రీమియంను 5 శాతం లోపునకు వచ్చేట్లు చేసింది. ఆ విధంగా ఐబీఎమ్ కన్నా 4.94 శాతం ఎక్కువకు కాంట్రాక్టును ఐవిఆర్‌సిఎల్‌కు అప్పగించారు.

అత్యల్ప టెండరరు సుహృద్భావనతో స్వచ్ఛందంగా రాయితీని ఇవ్వజూపడం ప్రభుత్వ శాఖల్లో మామూలు సంప్రదాయమేనని, అలాంటి స్వచ్ఛందమైన రాయితీని అంగీకరించడంవల్ల ప్రభుత్వానికి లబ్ధి కలుగుతుందని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 జూలై).

ఈ సమాధానం సముచితం కాదు. ఎందుకంటే ఇక్కడ తొలుత వేసిన బిడ్ మొత్తాలు నిర్దేశిత 5 శాతం పరిమితి కన్నా ఎక్కువగా ఉన్నాయి, స్వచ్ఛందమైన రాయితీ కారణంగానే అవి నిర్ధారిత పరిమితిలోకి వచ్చాయిగానీ లేకుంటే వాటిని తిరస్కరించాల్సి వచ్చేది. పైపెచ్చు అత్యల్ప బిడ్డరు సంస్థతో సహా అన్ని సంస్థల తొలి బిడ్‌లు, పరిమితికన్నా ఎక్కువగానే ఉన్నా బిడ్లను తెరచిన తర్వాత బిడ్ మొత్తాలను సవరించుకునే అవకాశం మాత్రం అన్ని సంస్థలకు ఇవ్వడం జరుగలేదు.

## 4.5 స్పెసిఫికేషన్లు/డిజైన్లు/ఒప్పందాల్లో మార్పులు

జలయజ్ఞం కింద చేపట్టిన పనుల విషయంలో, 97.46 లక్షల ఎకరాల ఆయకట్టునూ, 6310 గ్రామాలకు తాగునీటి వసతినీ కల్పించే ప్రయత్నంలో, ప్రభుత్వం స్థూలంగా పని పరిధినీ, సంబంధిత జిల్లాలను మాత్రమే పేర్కొంది. ఫలితంగా, మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టుల్లో పనులను అప్పగించిన తరవాత అవి జరుగుతున్న సమయంలో, ఈ కింద వివరించిన విధంగా, వాటి సాంకేతిక పరమైన స్పెసిఫికేషన్లు/డిజైన్లు/ఒప్పందాలకు మార్పులు చేసిన పలు ఉదంతాలున్నాయి.

i. నెట్టెంపాడులో 104, 105 ప్యాకేజిలకు సంబంధించిన టెండర్లు (2005 జనవరి), ఒప్పందాలు కూడా కాలువ మట్టం స్థాయిని + 380 మీటర్లుగా నిర్దేశించాయి. పనిని అప్పగించిన తరువాత +380 మీటర్ల స్థాయి వద్ద ఆశించిన ఆయకట్టు లభ్యం కాదని తేలడంతో డిపార్టుమెంటు కాలువ మట్టం స్థాయిని +385 మీటర్లకు మార్చింది (2006 మార్చి). కాలువ మట్టం స్థాయి మారడంతో తగ్గిన కాలువ పొడువు తాలూకు విలువ **₹4.43 కోట్లు**. ఈ మొత్తాన్ని గుత్తేదారు నుంచి సర్దుబాటు చేయలేదు.

ఈ విషయాన్ని సాంకేతిక నిపుణులు పరీక్షించి, కాలువ మట్టం స్థాయిని +380 మీటర్ల నుంచి +385 మీటర్లకు పెంచితే ఉద్దేశించిన ఆయకట్టును సాధించడం సాంకేతికంగా సాధ్యమౌతుందని అభిప్రాయపడ్డారనీ, దీనివల్ల ప్రభుత్వానికి అదనపు ఆర్థిక భారం ఉండదని కూడా తెలిపారనీ నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది (2012 జూలై). ఐతే, దాదాపుగా సామ్యమైన పరిస్థితుల్లో హంద్రీ నీవా ప్రాజెక్టులోని ప్యాకేజి 1 లో కూడా కాలువ మట్టం స్థాయిని +250 మీటర్ల నుంచి +253 మీటర్లకు మార్చినప్పుడు రాష్ట్ర స్థాయి కమిటీ, ఐబీఎమ్ కమిటీల ఆమోదం పొందిన తరువాత డిపార్టుమెంటు ₹4.31 కోట్లను సర్దుబాటు చేసింది. కాబట్టి పై సమాధానం ఆమోదయోగ్యం కాదు.

ii. హంద్రీ నీవా (ఫేజ్ I ప్యాకేజీ I) లో, సిద్దేశ్వరంలోని ఇన్‌టేక్ నుండి మచ్చుమర్రి వరకూ అప్రోచ్ ఛానెల్‌ను 165 క్యూమెక్కుల నీటివిడుదల సామర్థ్యంతో రూపకల్పన చేసారు. పనులను అప్పగించిన తరవాత దీనిని 206 క్యూమెక్కులకు పెంచారు. దీనిని అదనపు అంశంగా పరిగణించి **₹9.19 కోట్లను** చెల్లించారు. ఐతే, ఐబీఎమ్ అంచనాల ప్రకారం 165 క్యూమెక్కుల డిశ్చార్జి సామర్థ్యానికి మట్టి తవ్వకం పరిమాణం 44.26 లక్షల ఘనపు మీటర్లు ఉంటే, సవరించిన 206 క్యూమెక్కుల సామర్థ్యానికి మాత్రం అది కేవలం 44 లక్షల ఘనపు మీటర్లే ఉంది.

దీనికి నీటి పారుదల శాఖ సమాధానమీయలేదు.

iii. వెలిగొండ (తీగలేరు కాలువ)లో, ఉద్దేశించిన ఆయకట్టు 62,000 ఎకరాలైతే, 33,892 ఎకరాలకు మాత్రమే డిజైను చేసారు. ఫలితంగా, ఈ అదనపు అంశంపై ప్రభుత్వం **₹13.76 కోట్ల** మొత్తాన్ని అదనంగా చెల్లించాల్సి వచ్చింది.

ఈ వాస్తవాన్ని నీటి పారుదలశాఖ అంగీకరించింది. కాలువ బెడ్ వెడల్పు, ఎఫ్ఎస్‌డీలను '**లైన్డ్ సెక్షన్**'తో చేయాలన్న ప్రతిపాదనను గమనించకపోవడంవల్ల సాంకేతికమైన స్పెసిఫికేషన్లలో దీనిని '**అన్‌లైన్డ్**'గా చూపడం జరిగిందని శాఖ పేర్కొంది.

iv. హంద్రీ నీవా, టెండరు పత్రాల్లో కాలువలు, ప్రధాన పైపుల పొడవును స్పష్టంగా పేర్కొనడం జరిగింది. వీటి ఆధారంగానే బిడ్డర్లు తమ ధరలను కోట్ చేశారు. ఐతే, నిర్మాణంలో మాత్రం ఈ అంశాల పొడవులో గణనీయమైన తగ్గుదల వచ్చింది. ఎక్కువ పొడవును దృష్టిలో ఉంచుకుని కోట్ చేసిన తరువాత పొడవు తగ్గినందున గుత్తేదార్లకు **₹48.98 కోట్లు** మేర మిగులుతోంది. ఇలాంటి మార్పులకు అనువుగా ఒప్పందంలో తగిన నిబంధన లేకపోవడంతో ఇలాంటి తగ్గింపుల వల్ల కలిగే లబ్ధిని ప్రభుత్వం దక్కించుకోలేక పోయింది.

v. వెలిగొండ ప్రాజెక్టులో ప్యాకేజి 4 కు సంబంధించిన అంచనాలను తయారు చేస్తున్నప్పుడు '0.000 కి.మీ. నుంచి 9.800 కి.మీ. వరకు లింక్ కాలువ తవ్వకం' పరిమాణాన్ని 32.39 లక్షల ఘనపుమీటర్లుగా లెక్కించి ఆ మేరకు అంచనాలు రూపొందించారు. ప్యాకేజి పనులను అప్పగించిన తరువాత మొత్తం ప్రాజెక్టు పరిధిని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానికి అనుగుణంగా లింక్ కాలువ సామర్థ్యాన్ని పెంచి, గుత్తేదారుతో అనుబంధ ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. ఐతే, అదనపు పని విలువను లెక్కించేప్పుడు మొత్తం పరిమాణాన్ని డిపార్టుమెంటు 50.12 లక్షల ఘనపు మీటర్లుగా మదింపు వేసింది. దీని నుంచి డిపార్టుమెంటు తొలి అంచనాలోని 32.39 లక్షల ఘనపు మీటర్లకు బదులుగా 26.57 లక్షల ఘనపు మీటర్లను మాత్రమే తగ్గించింది. ఈ విధంగా, సవరించిన అంచనాలో 5.82 లక్షల ఘనపు మీటర్ల మట్టి పనిని అధికంగా చేర్చడం వల్ల గుత్తేదారుతో కుదుర్చుకున్న అనుబంధ ఒప్పందం విలువ **₹5 కోట్ల** మేర పెరిగింది.

vi. గాలేరు నగరిలో, ఈ కింద వివరించిన విధంగా, స్పెసిఫికేషన్లకు పలు మార్పులు చేసారు :

- ప్యాకేజీ 28/06 లో, 29 కిలోమీటర్ల పొడవున కాలువ తవ్వాలని టెండర్లో పేర్కొన్నారు. ఐతే, తవ్వినది మాత్రం 26.47 కిలోమీటర్లు మాత్రమే. పొడవు తగ్గడంతో **₹15.11 కోట్ల** మేర ఖర్చు తగ్గింది. ఈ మొత్తం కాంట్రాక్టరుకు మిగులే.

- ప్యాకేజీ 6/06, 7/06 లలో కూడా ఇలానే జరిగింది. నిర్దేశించిన దానితో పోలిస్తే, కాలవల పొడవులను వరుసగా 3.23, 5.17 కిలోమీటర్లు తగ్గించడంతో, ఈ ప్యాకేజీ ల్లో గుత్తేదారులకు **₹4.61 కోట్లు**, **₹13.13 కోట్లు** మిగిలాయి.

- ప్యాకేజీ 24/06 లో బీటీ ఇన్స్పెక్షన్ మార్గాన్ని 4.25 మీ. నుండి 3.75 మీ.కు తగ్గించారు. దాంతో కాంట్రాక్టరుకు **₹0.42 కోట్ల** మేర ఖర్చు తగ్గింది.

- ప్యాకేజీ 31 తొలి డిజైనులో, ఆర్‌సీసీ లైనింగ్‌తో ఒకే సొరంగం ఉంటే దానిని ఎస్ఎఫ్ఆర్ఎస్ లైనింగ్‌తో జంట సొరంగాలుగా మార్చారు. దీనివల్ల ఆర్థికపరంగా **₹17.33 కోట్ల** ప్రభావం పడింది.

- ప్యాకేజీ లు 48, 49 లలో నీటి విడుదల సామర్థ్యాన్ని 10,000 నుండి 20,000 క్యూసెక్కులకు పెంచడంతో, కాలువలను వెడల్పు చేయాల్సివచ్చింది. ఫలితంగా, మొదట ఐబిఎమ్‌లో నిర్దేశించిన విధంగా వాలులను చదును చేసే అవసరం ఉండదు. ఐతే, ఇందుకు సంబంధించి గుత్తేదారుకు ₹7.06 కోట్లను చెల్లించారు. చదును చేయడానికి సంబంధించి ప్రత్యేకించి కేటాయింపు చేయలేదనీ, గుత్తేదారు పనిని చేసేటట్లు ధృవీకరించుకోవడానికి మాత్రమే దీనిని చేర్చామని నీటిపారుదల శాఖ వాదించింది. కాలువను వెడల్పు చేస్తున్న నేపథ్యంలో ఈ అంశాన్ని అమలు చేయాల్సిన అవసరమే లేదు. పైగా దీనికోసం సరికొత్తగా కేటాయింపులు చేసారు. కాబట్టి ఈ సమాధానం అంగీకారం కాదు.

vii. రాజీవ్ దుమ్ముగూడెం (ప్యాకేజీ 32) లో, ప్రెషర్ మెయిన్ పైపులను ఒప్పందంలో నిర్దేశించిన 38.18 కి.మీ. లకు బదులు, 24.50 కి.మీ. వరకే వేసారు. ఫలితంగా గుత్తేదారుకు **₹106.65 కోట్లు** మిగిలాయి.

viii. భూపతిపాలెం జలాశయం కింద ఉద్దేశించిన 23,086 ఎకరాల ఆయకట్టుకు గాను, కేవలం 14,028 ఎకరాల ఆయకట్టును మాత్రమే అభివృద్ధి చేస్తున్నారు. ధరలోని **₹4.81 కోట్ల** వ్యత్యాసాన్ని గుత్తేదారు నుండి వసూలు చేస్తామని ప్రభుత్వం తెలిపింది.

ix. పోలవరం (ప్యాకేజీలు 63, 64) లో, తొలి డిజైను స్పెసిఫికేషన్‌లోని ' స్టీల్ రీ-ఇన్‌ఫోర్స్‌మెంట్' తో ఎమ్ 20 పనికి బదులు వాస్తవంలో స్టీలు లేకుండా ' పీసీసీ ఎమ్ 20 ' పనిని అమలు చేస్తున్న కారణంగా గుత్తేదారుకు కలుగుతున్న మిగులు **₹45.53 కోట్లు**.

x. ఎస్ఎల్‌బీసీలో, సొరంగం కోసం ఒక 'అడిట్ (నిలువ బొరియ)' ను తవ్వాలని ఐబీఎమ్‌లో పేర్కొన్నారు. ఆ ప్రకారం, రాతినేలలో తవ్వకానికి (ఘనపు మీటరుకు ₹964 చొప్పున) ఒక లక్ష ఘనపు మీటర్ల పరిమాణాన్ని, రాతి బోల్ట్ లకు సంబంధించి (రన్నింగ్ మీటరుకు ₹315 చొప్పున) 0.80 లక్షల రన్నింగ్ మీటర్ల పరిమాణాన్ని అంచనాల్లో చేర్చారు. కానీ, వాస్తవంగా నిలువ బొరియను తవ్వనేలేదు. ఆ విధంగా పనుల విలువ ₹12.16 కోట్ల మేర తగ్గింది. ఐతే, ఈ తగ్గింపు ప్రభుత్వానికి చేరలేదు.

అడిట్ (నిలువ బొరియ)' లను సాధారణంగా గాలి ప్రసరణ కోసం, ముడిపదార్థాలు, వస్తువుల చేరవేత దూరాన్ని తగ్గించడం కోసం ఏర్పాటు చేస్తుంటారని, నిలువ బొరియ అవసరమా కాదా అన్న విషయం పూర్తిస్థాయి ఇంజనీరింగ్ తరవాతే తెలుస్తుందని నీటి పారుదల శాఖ సమాధానమిచ్చింది. పూర్తిస్థాయి ఇంజనీరింగ్ చేయకుండానే అంచనాలను రూపొందించడంతో, పని పరిధి మారవచ్చని కూడా తెలిపింది.

xi. ఎస్ఎల్‌బీసీలో సొరంగం పనికి సంబంధించి ఐబీఎమ్‌లో, రెండో సొరంగానికి (టి-2) 500 మి.మి. మందంతో లైనింగ్ చేయాలని ఉంది. ఐతే, పనులు జరుగుతున్న సమయంలో, గుత్తేదారు సంస్థ లైనింగ్‌కు 425 మి.మి. మందాన్ని ప్రతిపాదించింది. అదనంగా అంచనా వేసుకున్న 75 మి.మి. మందం వలన సిమెంట్ కాంక్రీట్ పరిమాణంలో వ్యత్యాసాల కారణంగా ₹8.07 కోట్ల మేర అంచనాలు పెరిగాయి.

లైనింగ్‌కు అంచనాలలో 500 మి.మి. మందాన్ని ఐఎస్ నియమావళి ప్రకారం తీసుకున్నామనీ, 425 మి.మి. లైనింగ్ మందానికి ఆమోదాన్నివ్వడం జరిగిందనీ నీటి పారుదలశాఖ బదులిచ్చింది. ఐతే, పనులను ఐఎస్ నియమావళి ప్రకారమే అమలు చేయాలని ఒప్పందాలలో పేర్కొనడం వల్ల ఈ సమాధానం అంగీకారయోగ్యం కాదు.

xii. నెట్టెంపాడు స్టేజి II ఒప్పందంలో కాపర్, అల్యూమినియం, స్టీల్, సిమెంట్‌లకు ఐఇఇఎమ్ఏ[14] సూత్రం ప్రకారం ధరల పెరుగుదల వర్తిస్తుందనీ, బిడ్డింగ్ సమయంలో ఉన్న ధరలకూ, క్లెయిమ్ నాటికి భారతీయ రిజర్వు బ్యాంక్ సూచీల ప్రకారం ఉన్న ధరలకూ సంబంధించి అధికారిక పత్రాలను సమర్పిస్తేనే చెల్లింపులు జరుగుతాయని పేర్కొన్నారు. ధరల్లో వ్యత్యాసాన్ని సర్దుబాటు చేసేందుకు వీలుగా ఈ అంశాలకు బిడ్లలో పరిగణించిన ధరలను బిడ్డర్లు స్పష్టంగా సూచించాలని పేర్కొన్నారు.

ఐతే, గుత్తేదారు కాపర్, అల్యూమినియంలకు సబంధించి బిడ్డింగ్ సమయంలోనూ, క్లెయిమ్ చేసే నాటికీ ఉన్న ధరలకు అధికారిక రుజువులను చూపకపోయినా ప్రభుత్వం వీటి నిమిత్తం ₹15.53 కోట్లను చెల్లించి, మరో ₹2.51 కోట్ల చెల్లింపుకు ఆమోదం తెలిపింది.

అంతేకాకుండా, ధరల్లో వ్యత్యాసం ఐదు శాతం పరిమితిని దాటితేనే ధరల పెరుగుదలను వర్తింపజేయాలని ప్రభుత్వ ఉత్తర్వులు సూచిస్తున్నా, ఐదు శాతం పరిమితికి లోపున కూడా నీటిపారుదల శాఖ పరిహారాన్ని చెల్లించడానికి అంగీకరించింది. దీనివల్ల ₹49.67 లక్షల మేర అధిక చెల్లింపులు జరిగాయి. సిమెంట్, స్టీల్‌లకు సంబంధించి భవిష్యత్తులో భారతీయ రిజర్వు బ్యాంక్ సూచీలనే అనుసరిస్తామని నీటి పారుదలశాఖ సమాధానమిచ్చింది.

[14] భారతీయ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిదారుల సంఘం

xiii. దేవాదుల ప్రాజెక్టు ఫేజ్ - I లోని స్టేజి - I కి సంబంధించిన ఒప్పందంలో (2004 జనవరి) కాంట్రాక్టు గడువు కాలంలో కూలీలు, ముడిపదార్థాలు ఇతర వాడుక వస్తువుల ధరలలో వ్యత్యాసాలు వచ్చినా, చట్టాలలో మార్పులు చేసినా ధరల పెరుగుదల వర్తించదని పేర్కొన్నారు. ప్రీ-బిడ్ సమావేశంలో (2003 ఆగస్టు) స్టీల్‌కు ధరల సర్దుబాటు చేయాలని గుత్తేదారులు ప్రత్యేకించి కోరినప్పటికీ, ప్రభుత్వం దానిని తోసిపుచ్చింది. ఐతే, ఆతర్వాత, ఈ పనిలో వినియోగించిన స్టీల్, సిమెంట్, చమురులకు ధరల పెరుగుదలను అనుమతించి (2009 మార్చి) గుత్తేదారుకు ₹196.96 కోట్లను చెల్లించారు (2009 ఆగస్టు). ఈ మొత్తంలో, పైపుల తయారీలో ఉపయోగించిన స్టీల్ ప్లేట్‌ల ధరల్లో పెరుగుదల కోసమే ₹125.60 కోట్లను చెల్లించారు. ఐతే, ధరల పెరుగుదలరూపంలో చెల్లించిన మొత్తాన్ని సరిగా లెక్కించలేదు. వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రభుత్వం నిర్దేశించిన (2008 ఏప్రిల్) విధానం ప్రకారం, ధరల సర్దుబాటును లెక్కించడం కోసం, డిపార్టుమెంట్ అంచనాలలోని ధరలను మౌలిక ధరలుగా తీసుకొని, ప్రస్తుతమున్న ధరలను వివిధ తయారీదారుల నుంచి కొటేషన్లను పిలిచి ప్రతినెలా ఛీఫ్ ఇంజనీర్ల బోర్డు నిర్ణయిస్తుంటుంది. ఐతే, ధరల పెరుగుదలను లెక్కించేటప్పుడు, స్టీల్ తయారీదారుల నుండి స్టీల్ ధరలను డిపార్టుమెంట్ నిర్ధారణ చేసుకోనూలేదు, స్టీల్ ప్లేట్ల కొనుగోలుకు సంబంధించి వాస్తవ ఇన్‌వాయిస్‌లను సమర్పించమని గుత్తేదారుపై ఒత్తిడి తేనూలేదు. దానికి బదులు స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా నుండి గుత్తేదారు పొందిన పత్రాన్నే డిపార్టుమెంట్ ఆధారంగా చేసుకొంది.

గుత్తేదారు పేర్కొన్న ధరలనే ప్రస్తుతమున్న ధరలుగా పరిగణించినా కూడా ఈ కింద వివరించిన విధంగా ధరల పెరుగుదలను తప్పుగా లెక్కించడంతో, ₹35.86 కోట్ల మేర అధిక చెల్లింపు జరిగింది :

- టెండర్లు పిలవడానికి ముందు (2003 ఆగస్టు), ₹737.49 కోట్లుగా అంచనా వేసిన పని విలువలో, స్టీల్ ప్లేట్లకు ధరను మెట్రిక్ టన్నుకు ₹20,514గా తీసుకున్నారు. ప్రైస్ బిడ్లను తెరచిన తరవాత, ఈ అంచనాను స్టీల్ ప్లేట్ల ధరలు పెరిగాయంటూ ₹781.60 కోట్లకు సవరించారు (2003 నవంబరు). ఇక్కడ మెట్రిక్ టన్నుకు తీసుకున్న ధర ₹22,318. ఐతే, 2009 మార్చిలో ధరల పెరుగుదలను లెక్కించేటప్పుడు, నీటి పారుదల శాఖ సవరించిన అంచనా లోని ధరకు బదులు తొలి అంచనాలోని ధరను తీసుకొంది. దీనివల్ల గుత్తేదారు సంస్థకు ₹20.99 కోట్ల అధిక చెల్లింపు జరిగింది.
- అంతేకాకుండా స్టీల్ ధరలకు సెంట్రల్ ఎక్సైజ్ సుంకంతో కలిపే అంచనాలో తీసుకున్నారు. సెంట్రల్ ఎక్సైజ్ సుంకం కోసం అంచనాలో చేర్చిన విలువ మొత్తం ₹54.27 కోట్లు (ఇందులో ₹34.25 కోట్లు స్టీల్ ప్లేట్లకు సంబంధించినదే). ఆ తర్వాత, నీటి సరఫరా పథకాల్లో వాడే పైపులు, ఇతరాలకు సెంట్రల్ ఎక్సైజ్ సుంకం నుండి భారత ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది (2004 జనవరి). ఇక్కడ, ప్రభుత్వం రెండు విధాల నష్టపోయింది - (ఏ) సెంట్రల్ ఎక్సైజ్ సుంకం మినహాయింపుకు సంబంధించి ఒప్పందంలో ఏవిధమైన షరతులు లేనందువల్ల ఈ మొత్తం (₹34.35 కోట్లు) ప్రభుత్వానికి చెందలేదు, (బి) సెంట్రల్ ఎక్సైజ్ సుంకాన్ని మినహాయించి ధరలను పోల్చకుండా, ఆ సుంకాలతోపాటుగా స్టీల్ ధరల్లో పెరుగుదలను (₹14.87 కోట్లు) లెక్కించారు.

ఈపీసీ ఒప్పందంలో, పని పూర్తికావడమే ముఖ్యమనీ, సాంప్రదాయక 'లంప్‌సమ్' ఒప్పంద విధానంలోలా పరిమాణాలు ముఖ్యం కాదనీ నీటిపారుదల శాఖ తెలిపింది. మొదలు, తుది పాయింట్లు మారకుండా మౌలిక అంశాలకనుగుణంగా కాలువ మార్గాన్ని (అలైన్‌మెంట్) రూపకల్పన చేసుకొనే స్వేచ్ఛ గుత్తేదారుకుందనీ, లాభంతో పాటు రిస్క్‌ని కూడా గుత్తేదారే భరించాలని తెలిపింది. ఒప్పందాలలో ధరల వ్యత్యాసానికి సంబంధించి నిబంధన లేకపోవడంతో పలు సందర్భాలలో గుత్తేదారులు నష్టాలను భరించాల్సి వచ్చిందని కూడా పేర్కొంది.

ఈ కింది కారణాలవలన సమాధానం ఆమోదయోగ్యం కాదు.

- పనులకు తక్కువ స్పెసిఫికేషన్లు సరిపోయే చోట్ల ఒప్పందాలలో అధిక స్పెసిఫికేషన్లు సూచించకుండా ఉండాలి. అలాగే, డిపార్టుమెంట్ ప్రమాణాల ప్రకారం అధిక స్పెసిఫికేషన్లు అవసరమయ్యే పక్షంలో, తక్కువ స్పెసిఫికేషన్లతో పనులను అమలు చేయడానికి అనుమతించకూడదు. టెండర్లలో నిర్దేశించిన స్పెసిఫికేషన్ల ఆధారంగానే బిడ్లు వచ్చాయి కాబట్టి, వివిధ ప్రత్యామ్నాయాలను అనుసరించే స్వేచ్ఛను గుత్తేదారులకు ఇవ్వాలని భావించిన పక్షంలో, మొదట్లోనే టెండర్లు, ఒప్పందాలలో ఈ విధంగా స్పెసిఫికేషన్లను ప్రత్యేకించి పేర్కొనడంలో ఔచిత్యం లేదు.
- ఈపీసీ కాంట్రాక్టులో, టెండర్లను పిలిచి పనులను అప్పగించడానికి ముందే పని పరిధిని ఖచ్చితంగా నిర్ణయించుకోవడం ఎంతో ముఖ్యం. ఏయే గ్రామాలకు సాగునీటి సౌకర్యాలను కల్పించాలి, కాలువ మార్గంలో ఎన్ని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను ఎక్కడెక్కడ ఏర్పాటుచేయాలి వంటి ప్రాజెక్టు అవసరాలతోపాటు పనిపరిధి, డిజైను అంశాలు, నాణ్యతా ప్రమాణాలు, పనిషెడ్యూల్‌లను ఈపీసీ విధానంలో సుస్పష్టంగా నిర్వచించాలి.
- పనుల్లో మార్పులకు సంబంధించిన నిబంధనను ఒప్పందాలలో చేర్చాలని ఆడిట్ గతంలో సిఫార్సు చేసింది. దీనివల్ల ప్రభుత్వమో, గుత్తేదారో నష్టాన్ని భరించాల్సి రాకుండా, ప్రతి కేసూనూ సందర్భాన్ని బట్టి పరిశీలించవచ్చు. ఫిడిక్ విధానంలోని ఈపీసీ ఒప్పందాలలో ఇలాంటి నిబంధన ఉంది. జేఎన్ఎన్‌యుఆర్‌ఎమ్[15] కింద చేపట్టిన నీటి సరఫరా పథకాలు, ప్రాజెక్టుల ఈపీసీ ఒప్పందాల్లో కూడా ప్రభుత్వం ఇటువంటి 'వేరియేషన్ నిబంధన'ను చేర్చింది.

మార్పుల విషయంలో వ్యవహరించడానికి స్పష్టమైన విధానమేదీ లేకపోవడంవల్ల, కింద వివరించినట్లు, అలాంటి వివిధ కేసుల్లో అనుసరించిన పద్ధతిలో సారూప్యత లేకుండా పోయింది.

- ఎస్ఎల్‌బీసీ సొరంగ పథకంలోని ముఖ్యమైన అంశాల్లో దిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ఏర్పాటు చేయడం ఒకటి. ఇన్వెస్టిగేషన్, డిజైను, పనుల అమలుతోపాటు ఈ పథకాన్ని ₹157.74 కోట్లకు ఒక సంస్థకు అప్పగించారు (2009 ఫిబ్రవరి). ఒప్పందంలో ఇలా పేర్కొన్నారు : "అత్యధిక వరద నీటి విడుదల కోసం రేడియల్ గేట్లతో ఒక స్పిల్‌వేని రూపొందించాలి. ఐతే, అది 8580 క్యూమెక్కులకు తగ్గకూడదు. ఐఎస్ నియమావళి, కేంద్ర జలసంఘం మాన్యువల్, ఎపీడీఎస్ఎస్[16] ప్రమాణాలు, ఆయా సమయాల్లో సెంట్రల్ డిజైన్స్ సంస్థ ఛీఫ్ ఇంజనీరు జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం స్పిల్‌వేను డిజైను చేయాలి."

  గుత్తేదారు, ఇన్వేస్టిగేషన్ చేసిన తరవాత, గరిష్ఠ వరద నీటి విడుదలను 8936 క్యూమెక్కులుగా లెక్కించారు. ఐతే, హైడ్రాలజీ ఛీఫ్ ఇంజనీర్, ఒక అధ్యయనాన్ని నిర్వహించి, వరద స్థాయి 18625 క్యూమెక్కుల దాకా ఉంటుందని అంచనా వేసారు (2009 నవంబరు). గరిష్ఠ వరదనీటి విడుదలలో మార్పు వల్ల (i) గేట్ల సంఖ్య 17 నుండి 33కు (ii) ఎబట్‌మెంట్ల నిడివి 244 మీటర్ల నుండి 476 మీటర్లకు పెరగడంతో గుత్తేదారు వీటికి ₹64 కోట్లు అవుతుందని లెక్కించి (2009 డిసెంబరు) ఆమేరకు అదనంగా చెల్లించాలని కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయి కమిటీకి నివేదించగా, ప్రాజెక్టు మౌలిక ప్రమాణాల్లో సూచించిన విధంగా స్పిల్‌వేని 8580 క్యూమెక్కుల సామర్థ్యంతోనే నిర్మించాలని కమిటీ అభిప్రాయపడింది.
- ఇందుకు విరుద్ధంగా, పులిచింతల ప్రాజెక్టులో, (i) గేట్లు 33 నుండి 24కు (ii) డ్యామ్ పొడవు 534 మీటర్ల నుండి 355 మీటర్లకు తగ్గిపోయినప్పటికీ, ఈపీసీ ఒప్పందాలలో పరిమాణాలతో సంబంధం లేదని, పరిమాణాలు తగ్గితే, చెల్లింపులను తగ్గించేలా ఈ కాంట్రాక్టు విధానంలో నిర్దేశించలేదంటూ ప్రభుత్వం ఒప్పందం విలువను సర్దుబాటు చేయలేదు.

[15] జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకం

[16] ఆంధ్రప్రదేశ్ డిటైల్డ్ స్టాండర్డ్ స్పెసిఫికేషన్లు

ప్రాజెక్టు మౌలిక అంశాల్లో మార్పులను చేయాల్సొస్తే, వాటిని రాష్ట్ర స్థాయి కమిటీకి పంపుతామనీ, మార్పులకు సంబంధించి కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వమే తుది నిర్ణయం తీసుకుంటుందనీ, దీనికి గుత్తేదారు సంస్థ కట్టుబడి ఉంటుందనీ మార్పులను నిర్ణయించడంలో ఈ విధానాన్ని అనుసరిస్తున్నామంటూ నీటి పారుదలశాఖ వాదించింది (2012 జూలై).

ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. మార్పులను పరిష్కరించే అంశాన్ని ప్రతి సారీ రాష్ట్ర స్థాయి కమిటీకి పంపడం కంటే, ఈపీసీ ఒప్పందాలలోనే వీటికి సంబంధించి నిర్దిష్టంగా ఒక విధానమంటూ ఉండాలి.

ప్రాజెక్టుల మౌలిక ప్రమాణాలు అంటే ఏమిటో ప్రభుత్వం 2008 మేలో నిర్వచించింది[17]. ఐతే, అప్పటికే జలయజ్ఞం కింద చాలా ఒప్పందాలను కుదిర్చేసుకున్నారు. వీటిల్లోని కొన్ని ప్రాజెక్టులు అప్పటికే వివాదాల్లో చిక్కుకుని ఆ ప్రాజెక్టుల పురోగతిని దెబ్బతీసింది.

అంతేకాకుండా, అదనపు పనులకు అప్పటి ప్రామాణిక ధరల ఆధారంగా నీటి పారుదల శాఖ చెల్లింపులు చేసి, తొలగించిన పనులకు మాత్రం పేమెంట్ షెడ్యూల్‌ను అనుసరించింది. ఆ విధంగా, స్పెసిఫికేషన్లు/డిజైన్లు/పనిపరిధి/ఒప్పందాలు వగైరాలలో మార్పులు చేసిన అన్ని సందర్భాలలోనూ ఆ మార్పుల ప్రయోజనం చివరకు గుత్తేదార్లకే చేకూరింది. అంతేకాక, మార్పుల విలువను లెక్కించే విధానంలో సారూప్యత లేకపోవడంతో గాలేరు నగరిలో గుత్తేదార్లు ₹2.81 కోట్ల మేర లబ్ధిపొందారు. జలయజ్ఞంలో ఈపీసీ కిందకు రాని ఇతర కాంట్రాక్టుల విషయంలో, టెండరు డిస్కౌంటును తగ్గించడంవల్ల శ్రీరామ్‌సాగర్ స్టేజి - IIలో ₹2.60 కోట్లు, భూపతిపాలెం రిజర్వాయర్‌లో ₹9.62 కోట్ల మేర గుత్తేదార్లు లాభపడ్డారు.

పనులు జరుగుతున్న సమయంలో మార్పులకు సంబంధించి గుత్తేదార్లకు ప్రయోజనం కల్పిస్తూనే, ఒప్పందాల ప్రకారం వారు చేయాల్సిన కొన్ని పనుల బాధ్యతను ప్రభుత్వం తనమీద వేసుకుందని కూడా ఆడిట్ గమనించింది. మచ్చుకు తనిఖీ చేసిన 26 ప్రాజెక్టుల్లోని 8 ప్రాజెక్టుల్లో[18] అలాంటి సందర్భాలున్నాయి. ఫలితంగా ప్రభుత్వం పై ₹439.78 కోట్ల అదనపు భారం పడింది. వివరాలు ***అనుబంధం 4.3***లో ఇవ్వడమైంది.

### 4.5.1 పేమెంటు షెడ్యూళ్ళు (చెల్లింపు సూచీలు)

జలయజ్ఞం పనుల్లో చెల్లింపుల కోసం కాంట్రాక్టులో నిర్దేశించిన మొత్తం పనిని పలు అంశాలుగా విభజించి, ఒక్కో అంశం విలువను మొత్తం ఒప్పందం విలువలో కొంత శాతంగా నిర్ణయించారు. ఉదాహరణగా, పోలవరం ప్రాజెక్టులోని (ప్యాకేజి 64) ఒక పేమెంటు షెడ్యూలును ఈ కింద వివరించడమైంది.

పట్టిక - 4.13

| పని వివరం | ఒప్పందం ప్రకారం పేమెంట్ షెడ్యూల్ (మొత్తం రూపాయల్లో) | పనులు జరుగుతున్న సమయంలో సవరించిన పేమెంట్ షెడ్యూల్ (మొత్తం రూపాయల్లో) |
|---|---|---|
| ఇన్వెస్టిగేషన్ | 1.62 లక్షలు (0.022 శాతం) | 1.62 లక్షలు (0.022 శాతం) |
| ఎంట్రీ ఛానెల్ నిర్మాణం | 24.63 కోట్లు (33.33 శాతం) | 3.22 కోట్లు (4.36 శాతం) |
| జంట సొరంగాల నిర్మాణం | 24.63 కోట్లు (33.33 శాతం) | 60.85 కోట్లు (82.34 శాతం) |
| ఎగ్జిట్ ఛానెల్ నిర్మాణం | 24.63 కోట్లు (33.33 శాతం) | 9.81 కోట్లు (13.28 శాతం) |

*మూలం : పోలవరం ప్రాజెక్టు రికార్డులు*

[17] సర్క్యులర్ మెమో నెం. 34843/రిఫార్మ్స్/2006, తేదీ : 7 మే 2008

[18] (i) ఎల్లంపల్లి (ii) పోలవరం (iii) హంద్రీ నీవా (iv) గాలేరు నగరి (v) సీబీఆర్ - లింగాల (vi) నెట్టెంపాడు (vii) దేవాదుల (viii) తోటపల్లి ప్రాజెక్టులు

ఒప్పందం సమయంలో మూడు అంశాలకు చెల్లింపు శాతాలు సమానంగా ఉన్నాయని పై పట్టిక నుండి తెలుస్తోంది. పూర్తి చేసిన మేరకు పనుల ఆధారంగా, జంట సొరంగాల నిర్మాణ పనులకు ఆమోదించిన చెల్లింపు శాతాన్ని 82.34 శాతానికి పెంచి, ఎగ్జిట్ ఛానెల్ విషయంలో 13.28 శాతానికి తగ్గించారు. చెల్లింపు శాతాల్లోని ఆ విధమైన మార్పుల వల్ల, ఒక్క పోలవరం ప్రాజెక్టులోనే ₹228.19 కోట్ల మొత్తాన్ని ముందుగానే చెల్లించాల్సి ఉంటుంది.

మచ్చుకు తనిఖీ చేసిన ఇతర ప్రాజెక్టుల విషయంలో గాలేరు నగరి **(₹94.35 కోట్లు)**, నెట్టెంపాడు **(₹1.45 కోట్లు)**, దుమ్ముగూడెం నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ **(₹346.78 కోట్లు)**, ప్రాణహిత - చేవెళ్ళ **(₹1052.59 కోట్లు)**, తెలుగు గంగ **(₹4.45 కోట్లు)**, గండికోట - చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లిఫ్ట్ ప్రాజెక్టుల్లో కలిపి ఆ విధంగా **₹1,499.62 కోట్ల** మొత్తాన్ని ముందుగానే చెల్లించాల్సి వస్తోంది. నిజానికి, గాలేరు నగరి (ప్యాకేజి 48) లో, నీటి విడుదల సామర్థ్యాన్ని 10,000 క్యూసెక్కుల నుండి 20,000 క్యూసెక్కులకు పెంచారు. దీనివలన కాలువ వెడల్పును పెంచాల్సి వచ్చింది. ఈ పనులను కొనసాగించడానికి తొలి గుత్తేదారు తిరస్కరించడంతో ఒప్పందాన్ని అర్ధంతరంగా రద్దు చేసారు. ఈ సందర్భంలో, ఐబీఎమ్ ధరలకు టెండరు రాయితీని వర్తింప జేయడానికి బదులు, వాస్తవంలో చేసిన పనుల పరిమాణాలకు చెల్లింపులను చేసారు. ఫలితంగా, ఐబీఎమ్ విలువకు మించి ₹15.30 కోట్ల అధిక చెల్లింపు జరిగింది. పేమెంట్ షెడ్యూళ్ల ప్రకారమే చెల్లింపులు చేసామని నీటి పారుదలశాఖ తెలిపింది.

ప్రతి బిల్లు నుంచి డిపార్టుమెంట్ 7.5 శాతం మొత్తాన్ని పక్కన పెడుతుందనీ, ఒకవేళ గుత్తేదారు పనిని మధ్యలోనే ఆపేస్తే ఇలా పక్కన పెట్టిన మొత్తంతో పాటు, పని చేసే స్థలంలో ఉన్న గుత్తేదారు ఆస్తులన్నీ ప్రభుత్వపరం అవుతాయనీ, కాబట్టి ప్రభుత్వానికి ఎలాంటి నష్టం వాటిల్లబోదనీ నీటిపారుదల శాఖ తెలిపింది.

గుత్తేదార్లు తొందరగా పూర్తయ్యే పనులకు అధికశాతాన్ని/వెయిటేజిని ఇస్తూ, వాటి ప్రకారం క్లెయిమ్‌లను పొందుతున్నారు కాబట్టి ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. ఈ మొత్తాలు భవిష్యత్తులో సర్దుబాటు కాగలిగేవే అయినా జాప్యాలు జరిగే, పనులు అర్ధంతరంగా రద్దుచేసే సందర్భాలలో ఇవి వారివద్ద సుదీర్ఘ కాలం ఉండిపోతాయి. ఇలాగే దుమ్ముగూడెం నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్‌లో పనులు (2012 సెప్టెంబరు) ప్రారంభం కాకపోవడంతో, గత ఏడాదిన్నర కాలంగా ₹346.78 కోట్లు స్తంభించిపోయాయి.

## 4.6 మొబిలైజేషన్ అడ్వాన్సులు - ప్రభుత్వ నిధుల దిగ్బంధం

ప్రభుత్వం 2006 సెప్టెంబరులో సూచించిన విధానాన్ననుసరించి, ఒప్పందం విలువలో 10 శాతానికి సమానమైన మొత్తం, అంటే 5 శాతం కూలీలను సమకూర్చుకునేందుకు, మరో 5 శాతం యంత్రాలను కొనుగోలుచేసే నిమిత్తం మొబిలైజేషన్ అడ్వాన్సుగా గుత్తేదారుకు ఇస్తారు. ఒప్పందం కుదుర్చుకున్న వెంటనే కూలీలను, సిబ్బందిని సమకూర్చకునే నిమిత్తం 1 శాతం, మిగతా 4 శాతాన్ని వాస్తవంగా పనిని ఆరంభించే సమయంలోనూ (అంటే సర్వే, ఇన్వెస్టిగేషన్, డిజైన పనులు పూర్తైన తరువాత) ఇస్తారు. ఇలా ఇచ్చిన అడ్వాన్సు 10 శాతంపని పూర్తి అయిన తరువాతనే తిరిగి సర్దుబాటు అవుతుంది.

వివిధ కారణాలవలన పలు ప్యాకేజీల్లోని పనుల్లో కదలికలు లేని దృష్ట్యా మొబిలైజేషన్ అడ్వాన్సు పేరిట ప్రభుత్వ సొమ్ము గణనీయమైన మొత్తంలో గుత్తేదార్ల వద్ద స్తంభించిపోయింది. జలయజ్ఞం కార్యక్రమం చేపట్టినప్పటినుంచి గుత్తేదారులకు ఇచ్చిన మొబిలైజేషన్ అడ్వాన్సు మొత్తం, ఇంకా తిరిగి వసూలు చేయాల్సిన మొత్తాల వివరాలు ఈ కింద ఇవ్వడమైంది.

పట్టిక - 4.14


(₹ కోట్లలో)

| ప్రాంతం | ప్రాజెక్టులు | ప్యాకేజీలు | ఒప్పందాల విలువ | మొబిలైజేషన్ అడ్వాన్సు ఇచ్చిన ప్యాకేజీల సంఖ్య | ఇచ్చిన మొబిలైజేషన్ అడ్వాన్సు | వడ్డీతో ఇంకా వసూలు చేయాల్సిన మొత్తం |
|---|---|---|---|---|---|---|
| కోస్తా | 21 | 63 | 9513 | 49 | 514.34 | 150.03 |
| రాయలసీమ | 23 | 179 | 22612 | 152 | 1099.39 | 122.70 |
| తెలంగాణ | 30 | 166 | 81060 | 148 | 2013.67 | 866.13 |
| మొత్తం | 74 | 408 | 113185 | 349 | 3627.40 | 1138.87 |

*మూలం : నీటిపారుదల శాఖ ఇచ్చిన సమాచారం నుండి సంకలనం చేయడమైంది*

మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టుల్లో ఇచ్చిన మొబిలైజేషన్ అడ్వాన్సు, తిరిగి సర్దుబాటు చేసిన మొత్తాలు ఇలా ఉన్నాయి.

చార్టు - 4.3 (₹ కోట్లలో)




*మూలం : నీటిపారుదల శాఖ ఇచ్చిన సమాచారం*

ఇచ్చిన మొబిలైజేషన్ అడ్వాన్సుకు, తిరిగి వసూలు చేసుకున్న దానికి మధ్య తెలంగాణ విషయంలో ఉన్న భారీ తేడాకు ప్రధాన కారణం ప్రాణహిత - చేవెళ్ళ ప్రాజెక్టు. ఇందులోని 28 ప్యాకేజీలకుగాను 26 ప్యాకేజీల్లో గుత్తేదార్లతో ఒప్పందం కుదుర్చుకున్న తరువాత ఒప్పందం విలువలో ఒక శాతం చొప్పున ₹354.56 కోట్లు చెల్లించారు.

వీటిల్లో సర్వే, ఇన్వెస్టిగేషన్ పనులు ఇంకా పూర్తి కాని కారణంగా మొబిలైజేషన్ అడ్వాన్సులను తిరిగి వసూలు చేయడం మొదలవ్వలేదు (2012 జూలై). ఫలితంగా రెండేళ్ళకు పైగా ప్రభుత్వ నిధులు స్తంభించిపోయాయి. పనులు ఇంకా ప్రారంభం కాని కారణంగా భారీ మొత్తాలు గుత్తేదార్ల వద్ద స్తంభించిపోయిన ఇతర ప్రాజెక్టుల వివరాలు ఇలా ఉన్నాయి.

i. గాలేరు నగరి ప్రాజెక్టులోని ప్యాకేజి 4 లో 119.000 కిలోమీటర్ల నుంచి 141.350 కిలోమీటర్ల వరకు ఉన్న రీచ్ పనిని 2007 జూన్‌లోనే అప్పగించినా అటవీశాఖ అనుమతి పొందని కారణంగా ఇప్పటి వరకు పని ప్రారంభం కాలేదు. 2007 సెప్టెంబరు - 2008 జూలై మధ్యకాలంలో చెల్లించిన మొబిలైజేషన్ అడ్వాన్సు ₹5.60 కోట్లు గుత్తేదారు వద్ద చిక్కుకు పోయాయి.

ii. గాలేరు నగరి ప్రాజెక్టులోనే సర్వే, ఇన్వెస్టిగేషన్ పనులు పూర్తి కాకుండానే ***4 శాతం*** చొప్పున ₹4.47 కోట్ల మేర మొబిలైజేషన్ అడ్వాన్సు చెల్లించారు (2008 జూలై). నిజానికి 2008 జూలైలోనే సర్వే, ఇన్వెస్టిగేషన్ పనులు పూర్తి అయ్యాయని, కానీ మెజర్‌మెంటు పుస్తకాల్లో మాత్రం 2010 ఫిబ్రవరిలో ధ్రువపర్చారని డిపార్టుమెంటు తెలిపింది (2011 డిసెంబరు). కానీ మెజర్‌మెంటు పుస్తకాల్లో నమోదు చేయడం ఎందుకు ఆలస్యమైందో మాత్రం తెలుపలేదు.

iii. ఇందిరా సాగర్ దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకంలో (ఈపీఐఎల్‌కిచ్చిన) ప్యాకేజి-49 విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులను (2006 సెప్టెంబరు) ఉల్లంఘించి ఒప్పందం విలువలో ***5 శాతం*** చొప్పున గుత్తేదార్లకు ₹3.16 కోట్లను చెల్లించారు (2007 జూన్). ఐదేళ్లకు పైగా గడచినా ఈ మొత్తాన్ని 2012 జూలై నాటికి ఇంకా వసూలు చేయకపోవడంతో నిధులు ప్రభుత్వ పద్దులకు వెలుపల స్తంభించిపోయినట్లైంది.

iv. ఎల్లంపల్లి ప్రాజెక్టులోని "ఎల్లంపల్లి, ముర్మూర్ గ్రామాల్లో నిర్వాసితులైన కుటుంబాలకు పునరావాస ప్యాకేజీ ల అమలు" ప్యాకేజిలో గుత్తేదారు సంస్థ పనులను మందకొడిగా చేస్తుండడంతో డిపార్టుమెంటు పనుల్లోని వివిధ భాగాలను వివిధ సమయాల్లో ఆ సంస్థనుంచి ఉపసంహరించి వేర్వేరు ఇతర సంస్థలకు అప్పగించింది. అయినా, మొదటి గుత్తేదారు సంస్థకు చెల్లించిన (2009 జూలై) ₹1.40 కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్సులో ₹50.91 లక్షల మొత్తాన్ని ఆ సంస్థ నుంచి డిపార్టుమెంటు ఇంకా వసూలు చేయలేదు.

v. పోలవరంలోని ప్యాకేజి 66 లో పని మందకొడిగా సాగుతుండడంతో ₹6 కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్సును ఐదేళ్లు గడిచినా తిరిగి వసూలు చేయడం ఇంకా ప్రారంభం కాలేదు.

vi. పోలవరం ఎడమ గట్టు ప్రధాన కాల్వ ప్యాకేజిలు 1, 3 లలో భూసేకరణ, ఇతర అనుమతుల రాకలో జాప్యం కారణంగా 2008 ఆగస్టు నుంచి 2010 ఆగస్టు వరకు పొడిగించిన గడువు కాలానికి మొబిలైజేషన్ అడ్వాన్సులపై వడ్డీ ₹6.94 కోట్లు, ₹8.11 కోట్లను తిరిగి వసూలు చేయలేదు.

vii. **దుమ్ముగూడెం నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్‌**లో ₹126 కోట్లను మొబిలైజేషన్ అడ్వాన్సుగా చెల్లించి, కేవలం ₹3.50 కోట్లను మాత్రమే తిరిగి వసూలు చేశారు, ఇంకా ₹122.50 కోట్లు మిగిలే ఉంది. నిజానికి ఈ ప్రాజెక్టులో సర్వే, ఇన్వెస్టిగేషన్ పనులు పూర్తి కాక ముందే, ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించి 1 శాతానికి మించి మొబిలైజేషన్ అడ్వాన్సులను చెల్లించడం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.

**పట్టిక - 4.15**

**(₹ కోట్లలో)**

| ప్యాకేజి | ఒప్పందం విలువ | అనుమతించదగిన మొబిలైజేషన్ అడ్వాన్సు (1 శాతం చొప్పున) | చెల్లించిన మొబిలైజేషన్ అడ్వాన్సు | | అధికంగా చెల్లించిన అడ్వాన్సు |
|---|---|---|---|---|---|
| | | | శాతం | మొత్తం | మొత్తం |
| 8 | 1360.26 | 13.60 | 3 | 40.81 | 8 |
| 9 | 771.36 | 7.71 | 3 | 23.14 | 9 |
| 10 | 464.42 | 4.64 | 2.50 | 11.58 | 10 |
| మొత్తం | 2596.04 | 25.95 | | 75.53 | మొత్తం |

*మూలం : ప్రాజెక్టు రికార్డులు*

viii. నెట్టెంపాడు ప్రాజెక్టులోని ప్యాకేజిలు 99, 100, 107 లలో గుత్తేదారు సంస్థలు తమ మనుషులను, యంత్రాలను తీసుకుని పని జరిగే స్థలం నుంచి వెళ్ళిపోయారు. ఈ గుత్తేదారు సంస్థల నుంచి మొబిలైజేషన్ అడ్వాన్సుల నిమిత్తం ₹3.26 కోట్లను ఇంకా వసూలు చేయాల్సి ఉంది. ఆడిట్ ఈ స్థలాన్ని సందర్శించినప్పుడు అక్కడ పనివారు లేరు, యంత్రాలు లేవు. ఆ పనుల్లో ప్రగతి చాలా మందకొడిగా ఉంది. కాబట్టి అడ్వాన్సు ఇచ్చిన ఉద్దేశం నెరవేరలేదు.

ix. నెట్టెంపాడులోనే, మొబిలైజేషన్ అడ్వాన్సు వాస్తవంగా ఇచ్చిన తేదీలు, యంత్రాలు కొనుగోలు చేసినట్లు నిరూపించే ఇన్వాయిస్ కాపీలను ఆడిట్‌కు అందజేయలేదు. కాబట్టి, అవసరాల మేరకే చెల్లింపులు చేసారని నిర్ధారించడం సాధ్యంకాలేదు.

x. హంద్రీ నీవా ప్యాకేజి 33 లో ఇన్‌వాయిస్‌లు లేకుండానే ₹1.48 కోట్లు మొబిలైజేషన్ అడ్వాన్సును చెల్లించారు.

ఇటువంటి ఉదంతాలు పునరావృతం కాకుండా ఉత్తర్వులు జారీ చేశామని సమీక్షానంతర సమావేశంలో నీటి పారుదల శాఖ తెలిపింది. ఐతే, ఈ విషయంలో నియమాలను ఉల్లంఘించిన అధికారుల మీద తీసుకుంటున్న చర్యల గురించి మాత్రం ఆ శాఖ ప్రస్తావించలేదు.